ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152
షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు · తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers

PL.NO.IR/RNP/SV/26/2026
సంపుటి : 03 సంచిక : 192
మంగళవారం 21 జూలై 2026 పేజీలు 8 వెల : రూ.3
Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## ఇరాన్ సైనిక స్థావరాలే టార్గెట్.. 'హర్మూజ్'లో సెంటకామ్ విధ్వంసం!

**ఇరాన్‌పై వరుసగా తొమ్మిదో రోజు రాత్రి కూడా అమెరికా వైమానిక దాడులు**
**వాణిజ్య నౌకలపై దాడులను అరికట్టడమే సెంట్‌కామ్ లక్ష్యం**



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 20)
పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మరింతగా కమ్ముకున్నాయి. ఇరాన్ సైనిక సామర్థ్యాలను పూర్తిగా అణచివేయడమే లక్ష్యంగా అమెరికా సైన్యం తన దాడులను ఉద్ధృతం చేసింది. అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) అధికారికంగా వెల్లడించిన వివరాల ప్రకారం.. యూఎస్ దళాలు ▶2లో



## రాష్ట్రంలో 15వ ఆర్థిక సంఘం నిధులు దారిమళ్లాయి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 20)
రాష్ట్రంలో 15వ ఆర్థిక సంఘం నిధులు దారి మళ్లాయని, విచారణ జరిపి చర్యలు చేపట్టాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కేంద్రాన్ని కోరారు. ఈమేరకు ఆయన కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి రాజీవ్‌రంజన్‌సింగ్‌కు బహిరంగ లేఖ రాశారు. "కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లు.. తాగునీరు, పారిశుద్ధ్యం, ఘన-ద్రవ వ్యర్థాల నిర్వహణ, గ్రామ మౌలిక సదుపాయాలు, ప్రజా ఆస్తుల నిర్వహణ వంటి నిర్దేశిత పనులకే వినియోగించాల్సి ఉంటుంది. తెలంగాణలో ఈ నిధులను నిర్దేశిత లక్ష్యాలకు భిన్నంగా ఖర్చు చేస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. గ్రామాభివృద్ధి పనులకు వినియోగించకుండా సిబ్బంది జీతభత్యాలు, విద్యుత్ బిల్లులు, సాధారణ నిర్వహణ ఖర్చులు, ఇతర పరిపాలన అవసరాలకు మళ్లిస్తున్నట్లు గ్రామ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో మౌఖిక ▶2లో

## దశాబ్దాల మొండి సమస్యకు మంత్రి నారా లోకేశ శాశ్వత పరిష్కారం

**మంగళగిరిలో దశాబ్దాల ఇంటి స్థలాల సమస్యకు మంత్రి లోకేశ్ పరిష్కారం**
**'మన ఇల్లు -- మన లోకేశ్' కింద రెండో విడతలో 3 వేల మందికి పట్టాల పంపిణీ**
**ఈ నెల 21, 22 తేదీల్లో లబ్ధిదారులకు పట్టాలు అందించనున్న మంత్రి**
**నిషేధిత జాబితాలోని భూములకు ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు జారీ**
**సుమారు రూ.1,000 కోట్ల విలువైన భూములకు పేదలకు శాశ్వత హక్కులు**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 20)
ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, మంగళగిరి నియోజకవర్గంలో దశాబ్దాలుగా నెలకొన్న జటిలమైన భూ సమస్యకు రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారం చూపారు. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు యాజమాన్య హక్కులు కల్పించే ప్రక్రియను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా, 'మన ఇల్లు -- మన లోకేశ్' కార్యక్రమం కింద రెండో విడతలో సుమారు 3,000 కుటుంబాలకు ఈ నెల 21, 22 తేదీల్లో శాశ్వత పట్టాలు పంపిణీ చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

మంగళగిరి నియోజకవర్గంలోని కొండవాలు, అటవీ, దేవాలయ భూముల్లో వేలాది కుటుంబాలు దశాబ్దాలుగా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నాయి. అయితే, ఆ స్థలాలపై వారికి ఎలాంటి చట్టబద్ధమైన హక్కులు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ ఆస్తులను పిల్లలకు బదిలీ చేయాలన్నా, అత్యవసరానికి రుణం పొందాలన్నా వీలుకాని దుస్థితి నెలకొంది. ఎన్నికల ప్రచారంలో ఈ సమస్యను గుర్తించిన లోకేశ్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆ మాట ప్రకారం, అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు చేపట్టారు. ఈ ఏడాది ▶2లో

## తల్లీ--బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు కొత్త రూపు..

**నూతన వాహనాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు**
**రాష్ట్రవ్యాప్తంగా 500 నూతన వాహనాలతో సేవలు అందించనున్న ప్రభుత్వం**
**ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలకు ఉచిత, సురక్షిత రవాణా**
**జీపీఎస్, ఏసీ, సీట్ బెల్టుల వంటి ఆధునిక సౌకర్యాలతో వాహనాల రూపకల్పన**
**ఏటా సుమారు 2.75 లక్షల మంది బాలింతలకు ప్రయోజనం చేకూరనున్న అంచనా**




(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 20)
రాష్ట్రంలో మాతా--శిశు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం, 'తల్లీ--బిడ్డ ఎక్స్‌ప్రెస్' సేవలను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా, గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు సురక్షితమైన, నాణ్యమైన రవాణా సౌకర్యం కల్పించేందుకు సిద్ధం చేసిన 500 నూతన వాహనాలను ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాల రూపకల్పన, భద్రతా ప్రమాణాలు, ప్రయాణికులకు కల్పించిన సౌకర్యాలను సీఎం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా తల్లీబిడ్డల అవసరాలకు అనుగుణంగా వాహనాల్లో చేసిన మార్పులను అధికారులు ఆయనకు వివరించారు. ఈ సేవలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించేలా వాహనాలపై రూపొందించిన బ్రాండింగ్ నమూనాలను పరిశీలించి, వాటికి ఆమోదం తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలను, వారి నవజాత శిశువులను, సహాయకులను ఉచితంగా, క్షేమంగా వారి ఇళ్లకు చేర్చడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. దీంతో పాటు, అధిక రక్తహీనతతో బాధపడే గర్భిణులు, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న గర్భిణులను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రులకు తీసుకురావడానికి కూడా 2




## కేంద్రమంత్రి జేపీ నడ్డాతో కాక్రోచ్ జనతా పార్టీ నాయకుల భేటీ

**నీట్ వివాదంపై కేంద్రమంత్రి నడ్డాతో భేటీ**
**విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్**
**ఢిల్లీలో 'చలో సంసద్' ర్యాలీ... నిరసనకారులపై లాఠీఛార్జ్**
**సమస్యను అంతర్గతంగా చర్చిస్తానని నడ్డా హామీ**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 20)
నీట్-యూజీ 2026 ప్రశ్నాపత్రం లీకేజీతో పాటు పలు పరీక్షల్లో జరిగిన అవకతవకలపై ఆరోపణలు వెల్లువెత్తడంతో ఢిల్లీలో నిరసనలు ఉద్ధృతమయ్యాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు సోమవారం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో భేటీ అయ్యారు.

సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా ఢిల్లీలోని నడ్డా నివాసంలో సుమారు 10 నిమిషాల పాటు సమావేశమై, తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సమస్యపై అంతర్గతంగా ఉన్నత స్థాయిలో చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చారని, అయితే ఎటువంటి నిర్దిష్ట హామీలు లభించలేదని సౌరవ్ దాస్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం రోజే సీజేపీ 'పార్లమెంట్ ముట్టడి'కి పిలుపునివ్వడంతో జంతర్ మంతర్ వద్దకు విద్యార్థులు, యువత భారీగా చేరుకున్నారు. అక్కడి నుంచి పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నప్పటికీ ముందుకు వెళ్లేందుకు యత్నించిన ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు కొన్నిచోట్ల ▶2లో



## ప్రధాని పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 20)
విజయనగరం జిల్లాలో ప్రధాని పర్యటన ఏర్పాట్లను హోంమంత్రి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పరిశీలించారు. ఆగస్టు 1న భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. దీంతో ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం సాకారం కానుంది. ఉత్తరాంధ్ర సంస్కృతి ప్రతిబింబించేలా జానపద కళారూపాలతో స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారు. ▶2లో

## స్కైరూట్ విజయం వేళ..

### రాహుల్ వయసుపై ప్రధాని మోదీ చురకలు

**ప్రైవేట్ రాకెట్ ప్రయోగించిన యువతను ప్రశంసించిన ప్రధాని మోదీ**
**రాహుల్ గాంధీ వయసును ఉద్దేశించి పరోక్షంగా సెటైర్లు**
**స్కైరూట్ బృందం సగటు వయసు 28 అని వెల్లడి**
**తాను మాట్లాడుతోంది 56 ఏళ్ల యువకుడి గురించి కాదన్న ప్రధాని**



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 20)
పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. భారత్‌లో తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన హైదరాబాద్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్'ను అభినందిస్తూనే, రాహుల్ గాంధీ వయసును ఉద్దేశించి ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మీడియాతో మాట్లాడిన ప్రధాని, దేశం సాధించిన ఇటీవలి విజయాలను ప్రస్తావించారు. "భారత్ నుంచి తొలి ప్రైవేట్ రాకెట్‌ను ప్రయోగించిన స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు కేవలం 28 ఏళ్లేనని నాకు తెలిసింది. ఇంతటి అతి పిన్న వయస్కులు ఈ ఘనతను సాధించారు. నేను ఇక్కడ 56 ఏళ్ల 'యువకుడి' గురించి మాట్లాడటం లేదు... రోదసిలో త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన 28 ఏళ్ల ▶2లో

## ఏపీలో ఆక్వా రంగాన్ని ఆదుకోండి..

**ముగ్గురు కేంద్రమంత్రులకు చంద్రబాబు లేఖలు**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 20)
ఏపీలో ఆక్వా, రైతు సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు కోరారు. ఈ మేరకు ముగ్గురు కేంద్రమంత్రులకు ఆయన వేర్వేరుగా లేఖలు రాశారు. జన్యుపరంగా మార్పు చేసిన సోయాబీన్ మీల్‌ను దిగుమతి చేసుకునేందుకు రొయ్యల మేత తయారీదారులకు అనుమతి ఇవ్వాలని కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్‌ను సీఎం కోరారు. ఆక్వా రంగాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని.. ఏపీ నుంచి ఎఫ్‌సీవీ పొగాకు ఎగుమతులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు విజ్ఞప్తి చేశారు. ఆక్వా రంగంలో జీఎస్టీని 18 నుంచి 5 శాతానికి తగ్గించాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను సీఎం చంద్రబాబు కోరారు.

**అమరావతిలో ఎన్ఎఫ్‌డీబీ కార్యాలయం ఏర్పాటు చేయాలి**

రాష్ట్రంలో ఆక్వా రంగాన్ని మరింత అభివృద్ధి చేయటంతో పాటు ఎప్పటికప్పుడు సహకారం అందించేందుకు వీలుగా జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు (ఎన్ఎఫ్‌డీబీ) ప్రాంతీయ కార్యాలయాన్ని రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయాలని ▶2లో

## ప్రతి ఒక్కరూ ఓ భారతీయ భాషను నేర్చుకోవాలి

### కేంద్ర హోం మంత్రి అమిత్ షా పిలుపు



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 20)
నేటి యువత మాతృభాషతోపాటు ఓ భారతీయ భాషనూ నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. దేశ నాగరికత అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు భాషా వైవిధ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని నేషనల్ లైబ్రరీలో జరిగిన 'మ్యూజియం ఆఫ్ వర్డ్' ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శతాబ్దాలుగా భాషల్లో చోటుచేసుకున్న పరిణామాన్ని నేటి యువత అర్థం చేసుకోవడంలో ఈ మ్యూజియం దోహదపడుతుందని కేంద్ర మంత్రి తెలిపారు. భారత సంస్కృతి, వారసత్వాన్ని పునరుద్ధరించి బలోపేతానికి ప్రధాని మోదీ చర్యలు తీసుకుంటున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ▶2లో

## మొదటి పేజీ తరువాయి

## తల్లీ--బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు కొత్త రూపు..

ఈ వాహనాలను వినియోగించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 500 ాఖం/వీఖం వాహనాల ద్వారా అందించే ఈ సేవలతో ఏటా సుమారు 2.75 లక్షల మంది బాలింతలు లబ్ధి పొందనున్నారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ కొత్త వాహనాల్లో ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు పెద్దపీట వేశారు. వెనుక సీట్లలో సైతం సీటు బెల్టులు, బాలింతలు సులభంగా ఎక్కి దిగేందుకు వీలుగా ఫుట్‌రెస్ట్, ఎయిర్ కండిషనింగ్ (ఏసీ), ఫస్ట్ ఎయిడ్ కిట్, అగ్నిమాపక పరికరాలు వంటివి ఏర్పాటు చేశారు. ప్రతి వాహనానికి జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను అనుసంధానించడం ద్వారా వాటి కదలికలను రియల్ టైమ్‌లో పర్యవేక్షించనున్నారు. వాహనాలపై అధికారిక స్టిక్కరింగ్ పూర్తి చేసి, త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి వీరపాండ్యన్, జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇరాన్ సైనిక స్థావరాలే టార్గెట్..
## 'హార్మూజ్'లో సెంటకామ్ విధ్వంసం!

వరుసగా తొమ్మిదో రోజు రాత్రి కూడా ఇరాన్‌పై వ్యూహాత్మక వైమానిక దాడులతో విరుచుకుపడ్డాయి. అమెరికా కాలమానం ప్రకారం ఆదివారం రాత్రి 7 గంటలకు ఈ సరికొత్త దాడుల పర్వం ప్రారంభమైంది. అంతర్జాతీయంగా అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే వాణిజ్య నౌకలు, పౌర నావికులను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ దాడులకు పాల్పడుతోందని అమెరికా ఆరోపిస్తోంది. ఈ దాడులను తిప్పికొట్టేందుకే తాము వరుస దాడులు చేస్తున్నట్లు సెంటకామ్ ఎక్స్ ద్వారా స్పష్టం చేసింది. "ఇరాన్ సైనిక సామర్థ్యాలను నిర్వీర్యం చేసేందుకు మా దాడులు కొనసాగుతాయి" అని యూఎస్ కమాండ్ పేర్కొంది. అంతకుముందు జులై 18న కమాండర్ ఇన్ చీఫ్ ప్రత్యక్ష ఆదేశాల మేరకు ఇరాన్ దక్షిణ ప్రావిన్స్‌లలోని రక్షణ మౌలిక సదుపాయాలపై అమెరికా బాంబుల వర్షం కురిపించింది. గత 9 రోజులుగా జరుగుతున్న ఈ భీకర దాడుల్లో ఇరాన్‌కు చెందిన క్షిపణులు, డ్రోన్ నిల్వ కేంద్రాలు, తీరప్రాంత నిఘా వ్యవస్థలు, వైమానిక రక్షణ వ్యవస్థలను అమెరికా దళాలు విజయవంతంగా ధ్వంసం చేశాయి. జులై 17న జోర్డాన్‌లోని అమెరికా సైనికులను లక్ష్యంగా చేసుకుని దాడికి తెగబడిన ఇరాన్ రక్షణ దళానికి చెందిన 'ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్' (ఐఆర్‌జీసీ) గ్రూపులపై కూడా అమెరికా గట్టి ప్రతీకారం తీర్చుకుంది. ప్రస్తుతం పశ్చిమాసియా ప్రాంతంలో 50,000 మందికి పైగా అమెరికా సైనికులు మోహరించి ఉన్నారని, ఏ క్షణంలోనైనా శత్రువులను తుత్తునియలు చేయడానికి వారు సిద్ధంగా ఉన్నారని సెంటకామ్ హెచ్చరించింది.

## రాష్ట్రంలో 15వ ఆర్థిక సంఘం నిధులు దారిమళ్లాయి

ఆదేశాలతో గ్రామ సర్పంచులపై ఒత్తిడి తెచ్చి ఈ నిధులను ఇతర ఖర్చులకు వినియోగించే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఫలితంగా తాగునీటి పథకాలు, పారిశుధ్య పనులు, అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, ఘన వ్యర్థాల నిర్వహణ, వీధి దీపాలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. కేంద్ర ఆర్థికశాఖ ఈ ఏడాది ఇప్పటివరకు విడతలవారీగా రూ.2,293.74 కోట్లు రాష్ట్ర ఖజానాకు జమ చేసింది. మరో రూ.729.41 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేస్తున్న క్రమంలో తక్షణమే జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలి" అని లేఖలో పేర్కొన్నారు.

## దశాబ్దాల మొండి సమస్యకు మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారం

ఏప్రిల్‌లోనే తొలి విడతలో భాగంగా రత్నాల చెరువు, యర్రబాలెం, నీరుకొండ వంటి ప్రాంతాల్లో 3,002 మందికి సుమారు రూ.1,000 కోట్ల విలువైన భూములపై శాశ్వత హక్కులు కల్పించారు.
ప్రస్తుతం రెండో విడతలో భాగంగా మంగళగిరి డీజీపీ కార్యాలయం సమీపంలోని సీకే కన్వెన్షన్ హాలులో పట్టాల పంపిణీ కార్యక్రమం జరగనుంది. ఈ విడతలో అందించే పట్టాల మార్కెట్ విలువ కూడా సుమారు రూ.1,000 కోట్లు ఉంటుందని అంచనా.

వివిధ కేటగిరీల కింద పట్టాల పంపిణీ:

సెక్షన్ 22ఎ సమస్యకు పరిష్కారం: మంగళగిరి, నవులూరు గ్రామాల్లోని కొన్ని సర్వే నంబర్ల భూములు సెక్షన్ కింద నిషేధిత ఆస్తుల జాబితాలో ఉండటంతో 1,622 నివాస గృహాల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఈ నిషేధాన్ని తొలగిస్తూ, ఆర్డీవో ధ్రువీకరించిన 'ప్రాపర్టీ ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ల'ను మంత్రి లోకేశ్ లబ్ధిదారులకు అందజేయనున్నారు. స్టీల్ బ్రిడ్జ్ నిర్వాసితులకు పట్టాలు: అమరావతిలో బకింగ్‌హామ్ కాలువపై స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణంతో నిర్వాసితులైన 81 మందికి పునరావాసం కింద ఆత్మకూరు లేఅవుట్‌లో ప్లాట్లను కేటాయించారు. వీరికి సంబంధించిన పట్టాలను కూడా ఈ కార్యక్రమంలో పంపిణీ చేయనున్నారు. 30 కింద క్రమబద్ధీకరణ: 150 చదరపు గజాల లోపు విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను క్రమబద్ధీకరిస్తూ 906 పట్టాలను సిద్ధం చేశారు. వీటిలో తాడేపల్లి మండలానికి 630, మంగళగిరి మండలానికి 276 పట్టాలు ఉన్నాయి. మొత్తంమీద, దశాబ్దాలుగా కాగితాలపై హక్కుల్లేక అభద్రతా భావంతో జీవిస్తున్న వేలాది కుటుంబాలకు మంత్రి లోకేశ్ చొరవతో శాశ్వత భరోసా లభించనుంది.

## కేంద్రమంత్రి జేపీ నడ్డాతో కాక్రోచ్ జనతా పార్టీ నాయకుల భేటీ

లాఠీఛార్జ్ చేయడంతో పాటు బాష్పవాయువును ప్రయోగించారు. సోషల్ మీడియాలో ఒక వ్యంగ్య ఉద్యమంగా ఆరంభమైన కాక్రోచ్ జనతా పార్టీ, ప్రస్తుతం పరీక్షల లీకేజీలు, సాంకేతిక వైఫల్యాలపై నిరంతరాయంగా పోరాడుతోంది. ఈ ఉద్యమానికి మద్దతుగా పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ సుదీర్ఘ నిరాహార దీక్ష చేపట్టారు. ఆందోళనలు ప్రారంభమైన తర్వాత సీజేపీ నేతలతో కేంద్ర ప్రభుత్వం ఉన్నత స్థాయిలో చర్చలు జరపడం ఇదే ప్రథమం. తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత నిరసనలు కొనసాగిస్తామని సీజేపీ నాయకత్వం తేల్చిచెప్పింది.

## ప్రధాని పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై మంత్రి అనిత అధికారులకు కీలక సూచనలు చేశారు. హెలిప్యాడ్, ప్రజా వేదిక పనులను పరిశీలించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## స్కైరూట్ విజయం వేళ..

యువత గురించి మాట్లాడుతున్నాను" అని మోదీ పేర్కొన్నారు. జూన్ మాసంలో 56వ ఏట అడుగుపెట్టిన రాహుల్ గాంధీని ఉద్దేశించే ప్రధాని ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్పష్టమవుతోంది. హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ శనివారం 'విక్రమ్-1' రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఈ ప్రయోగం ద్వారా అమెరికా, చైనాల తర్వాత ప్రైవేట్ ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యాలను కలిగిన మూడో దేశంగా భారత్ రికార్డు సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా కేవలం కొన్ని దేశాలకు మాత్రమే పరిమితమైన ఈ ఘనతను భారత యువత సాధించడం దేశానికే గర్వకారణమని మోదీ కొనియాడారు. గత ఏడాది వర్షాకాల సమావేశాల కంటే ముందు ఓ భారత పౌరుడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న అంశాన్ని కూడా ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పార్లమెంట్ సమావేశాలు అర్థవంతంగా, ఫలప్రదంగా సాగాలని, ప్రజా సమస్యలపై లోతైన చర్చలు జరగాలని ఆయన ఆకాంక్షించారు.

## ప్రతి ఒక్కరూ ఓ భారతీయ భాషను నేర్చుకోవాలి

ఇక స్వర్ణమయ బెంగాల్

పశ్చిమ బెంగాల్‌లో వచ్చిన రాజకీయ మార్పు దేశ స్వాతంత్ర్యం తర్వాత చోటుచేసుకున్న గొప్ప పరిణామమని అమిత్ షా పేర్కొన్నారు. లెఫ్ట్, టీఎంసీల దశాబ్దాల దుష్ట పాలన నుంచి విముక్తి పొందిందని తెలిపారు. భాజపా నేతృత్వంలో ఇక స్వర్ణమయ బెంగాల్‌గా మారుతుందని పేర్కొన్నారు. అమూల్ బెంగాల్ డెయిరీ ప్రాజెక్టులో భాగంగా ప్రపంచంలోనే అతి పెద్ద పెరుగు ఉత్పత్తి కర్మాగారానికి వర్చువల్ విధానంలో అమిత్ షా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూ.700 కోట్లతో హౌడా ఫుడ్‌పార్కులో ఏర్పాటుకానున్న ఈ డెయిరీలో ప్రతి రోజూ 30 లక్షల లీటర్ల పాల శుద్ధితోపాటు వెయ్యి టన్నుల పెరుగును ఉత్పత్తి చేస్తారు.

## ఏపీలో ఆక్వా రంగాన్ని ఆదుకోండి..

సీఎం మరో లేఖలో కేంద్రమంత్రి రాజీవ్ రంజన్‌సింగ్‌ను కోరారు. ఈ ఏడాది జూన్ 5న విశాఖలో జరిగిన సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ వర్క్‌షాప్‌లో అమరావతిలో ఎన్‌ఎఫ్‌డీబీ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు హామీ ఇచ్చారన్నారు. రాజధాని పరిధిలోని నెక్కల్లులో 7.89 ఎకరాల ప్రభుత్వ భూమిని దీనికోసం కేటాయించామన్నారు. తక్షణం ఈ భూమిని స్వాధీనం చేసుకుని నిర్మాణాలు ప్రారంభించాలని కేంద్రమంత్రిని సీఎం కోరారు. 2028 నాటికి ప్రాంతీయ కార్యాలయం, అక్వేరియం, శిక్షణ కేంద్రాల పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతీయ కేంద్రం బ్లూ ఎకానమీ అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా మారుతుందన్నారు.

## చింతలపాలెంలో నూతన ఆర్వో వాటర్ ప్లాంట్ శంకుస్థాపన





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూలై 20)

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోనీ 5వ వార్డు చింతలపాలెం ఎస్సీ పాలెంలో నూతన ఆర్వో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి సోమవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించే లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్న ఈ ఆర్వో ప్లాంట్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బేరి పుల్లారెడ్డి, వార్డు ప్రజలు, స్థానిక నాయకులు, టౌన్ నాయకులు, మహిళలు, కూటమి నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఫేక్ వసూళ్ల పై అప్రమత్తంగా ఉండాలి

### మునిసిపల్ కమీషనర్ శ్రీధర్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూలై 20)

కనిగిరిలో ట్రేడ్ లైసెన్స్ ఫీజు పేరుతో ఫోన్ చేసి డబ్బులు వసూలు చేస్తున్న సైబర్ మోసగాళ్లను నమ్మవద్దని మున్సిపల్ కమీషనర్ పర్వతనేని శ్రీధర్ హెచ్చరించారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజులు జనవరి, ఫిబ్రవరిలోనే అధికారికంగా వసూలు చేస్తామని, ప్రస్తుతం ఎలాంటి వసూళ్లు లేవని స్పష్టం చేశారు. ఇంటిపన్నుల బకాయి వసూళ్ల విషయంలో అనుమానాస్పద కాల్స్ లేదా డబ్బులు అడిగే వ్యక్తులపై వెంటనే మున్సిపల్ కార్యాలయం ఫోన్ నెంబర్ 7993937001, లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని పట్టణ ప్రజలు, వ్యాపారులకు సూచించారు.

## షార్ శాస్త్రవేత్తలకు జేజేలు



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జులై 20)

భారత అంతరిక్ష రంగంలో మొదటి ప్రైవేట్ రాకెట్ ప్రయోగం విక్రమ్ 1 విజయవంతంగా ప్రయోగించిన షార్ (శ్రీహరికోట) శాస్త్రవేత్తలకు మార్కాపురం జిల్లా, తర్లుపాడు మండలం, లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ప్రధానోపాధ్యాయుడు షేక్ మౌలాలి ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో రాకెట్ నమూనాతో శాస్త్రవేత్తలకు జేజేలు పలుకుతూ అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరు శాస్త్రవేత్తల కృషిని అభినందించాలని హెచ్ఎం షేక్ మౌలాలి తెలిపి విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు.

## రాజకీయాలకు అతీతంగా.. ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన ప్రధాని

### కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు ప్రధాని మోదీ పుట్టినరోజు శుభాకాంక్షలు

### 84వ వసంతంలోకి అడుగుపెట్టిన మల్లికార్జున ఖర్గే ఆయనకు సంపూర్ణ ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించిన ప్రధాని



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, జూలై 20)

పలువురు కాంగ్రెస్ నేతలు కూడా ఖర్గేకు విషెస్ తెలిపారు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. 84వ ఏట అడుగుపెట్టిన ఖర్గేకు భగవంతుడు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ప్రధాని ఆకాంక్షించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా ప్రధాని మోదీ తన సందేశాన్ని పంచుకున్నారు. "రాజ్యసభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ మల్లికార్జున ఖర్గే గారికి జన్మదిన శుభాకాంక్షలు. ఆయనకు భగవంతుడు దీర్ఘాయువును, సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నాను" అని మోదీ తన సందేశంలో పేర్కొన్నారు. ప్రధానితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు సైతం ఖర్గేకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఆయన చేస్తున్న సేవలను గుర్తుచేస్తూ రాజ్యసభ సభ్యుడు మిలింద్ దేవర అభినందనలు తెలియజేశారు. పార్టీ పట్ల, రాజ్యాంగం పట్ల ఖర్గేకు ఉన్న అంకితభావాన్ని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఎంపీ మాణిక్యం ఠాగూర్ కొనియాడారు. 1942 జూలై 21న కర్ణాటకలోని బీదర్ జిల్లాలో ఒక దళిత కుటుంబంలో జన్మించిన ఖర్గే, సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో విశేష అనుభవం గడించారు. పలుమార్లు ఎమ్మెల్యేగా, కేంద్ర మంత్రిగా పనిచేసిన ఆయన, ప్రస్తుతం కర్ణాటక నుంచి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. 2022లో ఆయన కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. రాజకీయాల్లో ఇలాంటి సందర్భాల్లో పార్టీలకు అతీతంగా శుభాకాంక్షలు తెలుపుకోవడం ఒక ఆరోగ్యకరమైన సంప్రదాయంగా వస్తోంది.

## 'బట్టలు పెట్టి పట్టాలిస్తా'.. మంగళగిరిలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్

- మంగళగిరిలో ఇచ్చిన ప్రధాన హామీని నెరవేర్చిన మంత్రి లోకేశ్
- 'మన ఇల్లు -- మన లోకేశ్' కార్యక్రమంలో 3 వేల మందికి పట్టాల పంపిణీ
- సుమారు రూ.1000 కోట్ల విలువైన భూమికి శాశ్వత హక్కులు
- మంగళగిరిని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్న మంత్రి
- డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రాభివృద్ధి వేగవంతం అవుతుందన్న భరోసా



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 20)

ఎన్నికల సమయంలో ఇచ్చిన కీలక హామీని నెరవేరుస్తూ, 'బట్టలు పెట్టి పట్టాలిస్తా' అన్న మాటను నిలబెట్టుకున్నానని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళగిరిని దేశంలోనే ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో 'మన ఇల్లు -- మన లోకేశ్' కార్యక్రమం కింద మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన సుమారు 3 వేల మంది పేదలకు శాశ్వత భూహక్కు పట్టాలను ఆయన పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. "దశాబ్దాలుగా తమ ఇళ్లు, స్థలాలను ఎవరైనా లాక్కుంటారేమోనన్న భయంతో బతికిన ప్రజలకు ఈ రోజుతో ఆ భయం తొలగిపోయింది. కూటమి ప్రభుత్వం మీకు శాశ్వత హక్కును కల్పిస్తోంది. సుమారు రూ.1000 కోట్ల విలువైన ఈ భూమి ఇకపై మీ సొంతం. అవసరాలకు బ్యాంకులో పెట్టి రుణం కూడా తీసుకోవచ్చు" అని భరోసా ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాట నిలబెట్టుకుంటానని చెప్పానని, ఈ రోజు ఆ హామీని నెరవేర్చడం సంతోషంగా ఉందని తెలిపారు. 2019 ఎన్నికల్లో ఓటమి తర్వాత ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. "కొడుకును గెలిపించుకోలేకపోయావని మా నాన్నను కూడా అవమానించారు. కానీ, ఐదేళ్లు మీ మధ్యే ఉండి మీ మనసు గెలుచుకోవాలని నిర్ణయించుకున్నా. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీలలో ఒకటి ఇచ్చి నన్ను గెలిపించారు. మీరిచ్చిన ఈ బలమే నన్ను ముందుకు నడిపిస్తోంది" అని ఆయన భావోద్వేగంగా ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల బండిలా ముందుకు తీసుకెళ్తోందని లోకేశ్ అన్నారు. 'రూ.4 వేల పింఛను', 'తల్లికి వందనం', 'అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ' వంటి హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇంకా పూర్తిగా చక్కబడలేదని, రూపాయి ఆదాయానికి రూ.1.40 పైసల ఖర్చు ఉందని, అయినప్పటికీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీల డబుల్ ఇంజన్ సర్కార్ ఉందని, రాష్ట్రాభివృద్ధికి కేంద్రం అన్ని విధాలా సహకరిస్తోందని లోకేశ్ పేర్కొన్నారు. విశాఖ రైల్వే జోన్, పోలవరం, అమరావతికి నిధుల కేటాయింపు వంటి అంశాల్లో ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. కష్టకాలంలో అండగా నిలిచిన పవన్ కల్యాణ్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు యువతకు ఉద్యోగాలు కల్పించే దిశగా ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని, ఈ ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



ప్రకాశం



మార్కాపురం



బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
21.07.26 మంగళవారం



# అద్భుత విజయాలు అందుకోవాడానికి దృఢ సంకల్పమే బలమైన పునాది

## అద్భుత విజయాలు అందుకోవాడానికి దృఢ సంకల్పమే బలమైన పునాది

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 20) అద్భుత విజయాలు అందుకోవటానికి దృఢ సంకల్పమే బలమైన పునాది అని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఈ విధమైన అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. 2025 – 26 పదవ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ' షైనింగ్ స్టార్స్ ' అవార్డుల ప్రదాన కార్యక్రమం సోమవారం ఒంగోలు జిజిహెచ్ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. కలెక్టర్ తో పాటు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధనరావు, బిఎన్ విజయ్ కుమార్, రాష్ట్ర మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పి విజయ్ కుమార్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ముప్పవరపు సుచిత్ర, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పదవ తరగతి పరీక్షలలో వివిధ యాజమాన్యాలలోని 191 మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపి 'షైనింగ్ స్టార్స్' అవార్డులకు ఎంపికైనట్లు డీఈవో సివి రేణుక వివరించారు. ప్రతి మండలం నుంచి ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేసామని, వీరిలో ఓసి ఇద్దరు, బిసి ఇద్దరు, ఒక ఎస్సీ, ఒక ఎస్టి విద్యార్థిని లబ్ధిదారులుగా చేసామన్నారు. ఆర్ఐఓ ఆంజనేయులు మాట్లాడుతూ ఇంటర్మీడియట్లో 38 మందికి అవకాశం లభించిందన్నారు. ప్రతి గ్రూపు నుంచి ఐదుగురిని ఎంపిక చేశామని, వీరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసి, మైనారిటీ వర్గాల నుంచి ఒక్కొక్కరిని లబ్ధిదారులుగా చేసామన్నారు. ' షైనింగ్ స్టార్స్ ' కు ఈ సందర్భంగా ఒక్కొక్కరికి 20వేల రూపాయల నగదు ప్రోత్సాహకం, మెడల్, ప్రశంసాపత్రాన్ని అతిథులు అందించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంత్రి లోకేష్ ఉత్తమ విధానాలను ప్రవేశపెట్టి, వాటి అమలు నిరంతరం పర్యవేక్షించడం వలన విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా సుమారు 46 లక్షల రూపాయలను షైనింగ్ స్టార్స్ ప్రోత్సాహకంగా ప్రభుత్వం అందించిందన్నారు. తన చిన్నతనంలో ఇలాంటి ప్రోత్సాహకాలు లేవని కలెక్టర్ చెప్పారు. చిన్నతనంలో తాను కూడా కష్టాలు ఎదుర్కొన్నానని, విద్య విలువను గుర్తెరిగి చదువుకోవటం వలనే ఉన్నత స్థానానికి చేరుకున్నానని వివరించారు. ప్రస్తుతం విద్యా




రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చి ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. ఉన్నత విద్యావంతులైన లోకేష్ విద్యా శాఖ మంత్రిగా ఉన్నారని, విద్యార్థులకు భద్రత, ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం, ఉత్తమ విద్యపై దృష్టి సారించారని వివరించారు. మార్కాపురంలో ఫుడ్ పాయిజన్ వలన విద్యార్థులు కొంత అనారోగ్యానికి గురైనప్పుడు 'మా బిడ్డలకు ఏమైంది?' అని నేరుగా మంత్రి లోకేష్ ఆరా తీయడమే దీనికి నిదర్శనం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని విద్యార్థులకు ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వం అందించిన ఈ ప్రోత్సాహకాన్ని విజయవంతమైన కెరియర్ కు తొలిమెట్టుగా మలచుకోవాలని సూచించారు. కుటుంబానికీ, రాష్ట్రానికీ మంచి పేరు తెచ్చేవారిగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే జనార్ధన్ మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో గత ఏడాది నాలుగో స్థానంలో ఉన్న ప్రకాశం జిల్లా ఈ ఏడాది మొదటి స్థానానికి వచ్చేలా మరింత ఉత్సాహంతో పనిచేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ ఏడాది బడ్జెట్లో 35 వేల కోట్ల రూపాయలను కేటాయించడమే విద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని తెలియ చేస్తున్నట్లు చెప్పారు. సర్వేపల్లి రాధాకృష్ణ కిట్టులో నాణ్యమైన దుస్తులు, పుస్తకాలు, బూట్లు అందించడంతోపాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెడుతూ, ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడం ద్వారా ప్రతిబిడ్డ చదువుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఎమ్మెల్సీ శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్ గా మార్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఇందులో భాగంగానే విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర చరిత్రలో అధిక సంఖ్యలో టీచర్లను భర్తీ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబే అని ఆయన అన్నారు. ఉద్యోగాలు చేసేవారిగా కాకుండా ఇతరులకు ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కందుకూరులోని తమ ప్రకాశం ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీలో చేరే షైనింగ్ స్టార్స్ విద్యార్థులకు హాస్టల్ వసతి ఉచితంగా కల్పిస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ ఏ రంగంలో రాణించాలన్నా విద్యే కీలకమన్నారు. అందుకే విద్యారంగానికి రాష్ట్రప్రభుత్వం పెద్ద పేట వేస్తున్నట్లు చెప్పారు. కేవలం మార్కుల పైనే కాకుండా విద్యార్థుల సమగ్ర ఎదుగుదలపై దృష్టి పెట్టిందన్నారు. వాటి ఫలితాలు స్పష్టంగా మన కళ్ల ఎదుటే ఉన్నాయని ' షైనింగ్ స్టార్స్ ' ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఏపి మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ సవాళ్లను అధిగమించి సత్ఫలితాలు సాధించడంలో మంత్రి లోకేష్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కీలకమైన విద్యాశాఖను తీసుకుని సంస్కరిస్తున్న తీరు, సాధిస్తున్న ఫలితాలే దీనికి నిదర్శనం అన్నారు. రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పి విజయ్ కుమార్ మాట్లాడుతూ నేడు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరగటం, కొన్నిచోట్ల ' నో అడ్మిషన్ ' బోర్డు పెట్టడం గొప్ప పరిణామమన్నారు. మంత్రి లోకేష్ తీసుకొచ్చిన సంస్కరణల వలన డ్రాపౌట్స్ తగ్గి, ' నో అడ్మిషన్స్ ' పెరిగాయన్నారు. సుచిత్ర మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుతం అందుకుంటున్న ఈ ప్రోత్సాహకం, భవిష్యత్తు విజయాలకు తొలి అడుగు కావాలని ఆకాంక్షించారు. కాగా, ప్రభుత్వ సహకారం, తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల మార్గ నిర్దేశం ద్వారా ఈ విజయాలను పొందగలిగామని పలువురు ' షైనింగ్ స్టార్స్ ' తమ అనుభవాలను ఈ వేడుకలో పంచుకున్నారు. ఈ వేడుక ప్రారంభంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ' షైనింగ్ స్టార్స్ ' తల్లిదండ్రులు పాల్గొన్నారు. (తరువాయి 4లో...)

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా ప్రభుత్వం ముందడుగు

### జిల్లా కలెక్టర్ విజయ సునీత




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 20) విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా ప్రభుత్వం ముందడుగు వేస్తుందని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. మార్కాపురం పట్టణంలోని జడ్పీ బాలురు ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన షైనింగ్ స్టార్స్ 2026 అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా మరింత ఉత్సాహం, పట్టుదల పెరిగి విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధిస్తారన్నారు.

ప్రభుత్వం విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని దీనివల్ల ఉత్తీర్ణత శాతం పెరగడంతోపాటు దాదాపు లక్ష మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి విద్యార్థి ఒక శక్తి కేంద్రమని ధైర్యం తో లక్ష్యం వైపు అడుగులు వేయాలని వారికి సూచిం చారు. విద్యార్థులు నైపుణ్యాలను నేర్చుకొని మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మరో ముఖ్య అతిథి కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఇంత ప్రోత్సాహం గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. విద్య ద్వారానే కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగుపడతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి చదువు పై ప్రత్యేక దృష్టి పెట్టి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. అనంతరం జిల్లాలో షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికైన 134 మంది విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి అవార్డు, రూ. 20వేల నగదు చెక్కును తల్లిదండ్రుల సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో (తరువాయి 4లో...)

## కేంద్ర మంత్రులతో

# రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధుల కీలక భేటీ

### ఆక్వా, పొగాకు రంగాల సమస్యల పై వినతిపత్రాల సమర్పణ




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 20) ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధుల బృందం సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రులను విడివిడిగా కలుసుకుంది. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలకమైన అంశాలపై ఈ సందర్భంగా చర్చించి, వినతిపత్రాలను అందజేశారు. కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి మరియు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ఆయన నివాసంలో రాష్ట్ర మంత్రుల బృందం సమావేశమైంది. అమరావతిలో జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ ప్రాంతీయ కార్యాలయం, ఆక్వా క్వారంటైన్ ఫెసిలిటీ ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేయడంపై ఆయనతో సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ గారితో ఢిల్లీలోని 'వాణిజ్య భవన్' లో రాష్ట్ర మంత్రుల బృందం కీలక సమావేశం నిర్వహించింది. ఆక్వాకల్చర్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, ఎఫ్‌సీవీ పొగాకు రైతులు, ఎగుమతిదారుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వాణిజ్య భవన్‌లో జరిగిన సమావేశంలో ఆక్వాకల్చర్ రంగం సమస్యలపై కేంద్ర వాణిజ్య శాఖ మంత్రికి రాష్ట్ర మంత్రులు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే రొయ్యల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉందని, ఈ రంగం పై లక్షలాది మంది రైతులు, కార్మికులు, హేచరీలు, ఫీడ్ తయారీదారులు, ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతిదారులు ఆధారపడి జీవిస్తున్నారని వివరించారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో రొయ్యల ధరలు గణనీయంగా పడిపోవడం, ఉత్పత్తి వ్యయం (ముఖ్యంగా ఫీడ్ ధరలు) భారీగా పెరగడం వల్ల రైతులు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని రెండు కీలక విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. అందులో భాగంగా, ఫిష్ మీల్ ఎగుమతులను నియంత్రించి దేశీయ అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఫీడ్ తయారీ వ్యయం తగ్గించి రైతులకు ఉపశమనం కలిగించాలని కోరారు. అలాగే, నమోదు చేసుకున్న రొయ్యల ఫీడ్ తయారీ సంస్థలకు మాత్రమే పరిమిత స్థాయిలో, 2021 నాటి విధానాన్ని అనుసరించి తగిన నియంత్రణలతో జన్యుమార్పిడి సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ చర్యల వల్ల ఫీడ్ తయారీ ఖర్చు తగ్గి, రైతుల ఆదాయం మెరుగుపడటంతో పాటు భారత రొయ్యల ఎగుమతుల పోటీతత్వం, విదేశీ మారకద్రవ్య ఆదాయం, లక్షలాది కుటుంబాల జీవనోపాధి రక్షించబడుతుందని మంత్రులు పేర్కొన్నారు. కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ నివాసంలో జరిగిన భేటీలో అమరావతిలో ఎన్ఎఫ్‌డిబి ప్రాంతీయ కార్యాలయం, (తరువాయి 4లో...)



# చెన్నై లవ్ స్టోరీని ప్రేక్షకులు ఆదరించాలి

### పేస్‌లో సందడి చేసిన హీరో, హీరోయిన్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 20) ఈ నెల 24వ తేదీ విడుదల అవుతున్న చెన్నై లవ్ స్టోరీనీ ప్రేక్షకులు ఆదరించాలని చిత్ర హీరో కిరణ్, హీరోయిన్ గౌరీ ప్రియ కోరారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన మీడియా





సమావేశంలో మాట్లాడారు. గతంలో ఎన్నో ప్రేమ, కథలు వచ్చాయని, వాటికి భిన్నంగా చెన్నై లవ్ స్టోరీ ఉంటుందన్నారు. దర్శకుడు రవి నంబూరి ఎంతో చక్కగా ఈ చిత్రాన్ని తీశారన్నారు. ఈ చిత్రానికి సంగీతం ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందన్నారు. అనంతరం పేస్ కాలేజి విద్యార్థులతో కలిసి సినిమా ప్రమోషన్ వర్క్ లో వాళ్ళు పాల్గొన్నారు. హీరో హీరోయిన్లతో ఫోటోలు దిగేందుకు విద్యార్థులు పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో పేస్ ఇంజనీరింగ్ కాలేజ్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

## అద్భుత విజయాలు అందుకోవాడానికి
# దృఢ సంకల్పమే బలమైన పునాది













# నూతన డీఎంహెచ్ఓ డాక్టర్ పి యుగందర్‌ను సన్మానించిన నక్కలదిన్నె పీహెచ్‌సీ వైద్య బృందం



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జూలై 20)

కడప జిల్లా నూతన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పి యుగంధర్‌ని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది, వైద్య బృందం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా కడప వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. గతంలో మచిలీపట్నం జిల్లా డీఎంహెచ్ఓగా సమర్థవంతంగా సేవలందించిన డాక్టర్ యుగందర్ ఇటీవల కడప జిల్లాకు బదిలీపై వచ్చి నూతన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా, ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియాజేశారు. ఈ సందర్భంగా వైద్య బృందం మాట్లాడుతూ, డాక్టర్ పి. యుగందర్ నాయకత్వంలో కడప జిల్లాలో ప్రజారోగ్య సేవలు మరింత బలోపేతం కావాలని, ప్రభుత్వ వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్య సంక్షేమమే లక్ష్యంగా ఆయన విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి ఓబులేసు, ఆరోగ్య విస్తరణ అధికారి యం రాఘవయ్య, డిప్యూటి హెచ్ఈఓ జయ ప్రకాశ్, సూపర్ వైజర్ ప్రసాద్, పీహెచ్‌సీ వైద్య, పారామెడికల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రులతో రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధుల కీలక భేటీ




ఆక్వా క్వారంటైన్ ఫెసిలిటీ ఏర్పాటు గురించి చర్చించారు. విశాఖపట్నం వేదికగా జరిగిన ఎగుమతుల వాణిజ్య సదస్సులో కేంద్ర మంత్రి దీనికి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు. దీనికి అనుగుణంగా, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జీవో నెం.146 ద్వారా అమరావతి సమీపంలో 7.89 ఎకరాల భూమిని కేటాయించిందని తెలిపారు. డిపిఆర్ తయారీ, పరిశీలనలు, ఆర్థిక అనుమతులు, నిధుల విడుదల , టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి 2028 నాటికి ఈ కేంద్రాల నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. ఈ కేంద్రాల ఏర్పాటు వల్ల ఎన్ఎఫ్‌డిబి ప్రాంతీయ కార్యాలయం, ఆక్వా క్వారంటైన్ ఫెసిలిటీ, శిక్షణ కేంద్రం అందుబాటులోకి వచ్చి ప్రజలకు, ఆక్వా రంగానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. నమ్మకమైన బ్రూడ్ స్టాక్ తయారీ సంస్థల విస్తరణకు, క్వారంటైన్ నిబంధనల సడలింపునకు తగిన చర్యలు తీసుకోవాలని, 2021 నాటి భద్రతా నిబంధనలను అనుసరించి అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వాణిజ్య భవన్ సమావేశంలో పొగాకు ఎగుమతులకు ప్రోత్సాహకాలు అందించాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కి వినతిపత్రం సమర్పించారు. భారతదేశ ఎఫ్‌సీవీ పొగాకు ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని, ఈ రంగం పై లక్షలాది మంది రైతులు, కూలీలు ఆధారపడి ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం పొగాకు ఎగుమతిదారులకు తగిన ప్రోత్సాహకాలు అందకపోవడం వల్ల అంతర్జాతీయ మార్కెట్లో గట్టి పోటీని ఎదుర్కొంటున్నారని మంత్రులు వివరించారు. ఈ నేపథ్యంలో హెచ్ఎస్ కోడ్ 2401 (2401 10, 2401 20, 2401 30) కింద ఉన్న అన్‌మాన్యుఫ్యాక్చర్డ్ పొగాకుకు ఆర్ఓ డిటిఈపి పథకాన్ని వర్తింపజేయాలని, అలాగే ఇంట్రస్ట్ ఈక్వలైజేషన్ స్కీమ్ పరిధిలోకి కూడా దీనిని తీసుకురావాలని తెలిపారు. భారత్ నుండి ఎఫ్‌సీవీ పొగాకు ఎగుమతులు 2021-22లో 105.21 మిలియన్ కిలోల (విలువ రూ.2,909.99 కోట్లు) నుండి 2025-26 నాటికి 155.05 మిలియన్ కిలోలకు (విలువ రూ.7,782.98 కోట్లు) పెరిగాయని, ఇది భారత పొగాకు నాణ్యతకు నిదర్శనమని వివరించారు. జింబాబ్వే, బ్రెజిల్ వంటి దేశాలు తమ ఎగుమతిదారులకు భారీగా ఆర్థిక ప్రోత్సాహకాలు ఇస్తున్నందున, భారత పొగాకు ఎగుమతిదారులు అంతర్జాతీయ పోటీలో నిలబడటానికి కేంద్ర ప్రభుత్వం ఈ పథకాలను త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రొయ్యల, పొగాకు రైతుల సంక్షేమం, ఆయా రంగాల స్థిరాభివృద్ధికి పూర్తిగా కట్టుబడి ఉందని, కేంద్ర మంత్రులు ఈ అంశాలను అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని రాష్ట్ర మంత్రుల బృందం వెల్లడించింది.




# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా ప్రభుత్వం ముందడుగు

విద్యాశాఖ ఆర్జెడి లింగేశ్వర రెడ్డి, ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐఓ స్వరూప రాణి, డీఈవో సుబ్బారావు, డీసీఈబీ కార్యదర్శి సుధాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, ఇతర విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# గొబ్బూరు రైతు బిడ్డ ఘన విజయం
# 594 మార్కులతో షైనింగ్ స్టార్‌గా బ్రహ్మారెడ్డి




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 20)

కమలా కాన్సెప్ట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం పి పుల్లయ్య మాట్లాడుతూ పట్టుదల, కృషి ఉంటే పేదరికం గానీ, గ్రామీణ నేపథ్యం గానీ విజయానికి అడ్డంకి కాదని మరోసారి నిరూపించాడు పెద్దారవీడు మండలం గొబ్బూరు గ్రామానికి చెందిన ఏరువ బ్రహ్మారెడ్డి. రైతు కుటుంబంలో జన్మించిన ఆయన మార్కాపురంలోని కమల కాన్సెప్ట్ స్కూల్లో పదో తరగతి చదివి 594 మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలవడమే కాకుండా, షైనింగ్ స్టార్-2026 ప్రతిభావంతుల జాబితాలో చోటు దక్కించుకుని అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఈ సందర్భంగా కమల కాన్సెప్ట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంపి పుల్లయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన రైతు కుటుంబ విద్యార్థి ఈ స్థాయిలో ప్రతిభ కనబరచడం పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. కష్టపడి చదివితే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని బ్రహ్మారెడ్డి నిరూపించాడని కొనియాడారు. కమల విద్యా సంస్థల అధినేత పెనుగొండ పవన్ కుమార్, డైరెక్టర్ సింధుజ మాట్లాడుతూ బ్రహ్మారెడ్డి విజయం వేలాది మంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన విద్యార్థి తన ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు పొందడం ఆనందదాయకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. బ్రహ్మారెడ్డిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు ఘనంగా అభినందించారు. ఈ విజయం కమల కాన్సెప్ట్ స్కూల్ నాణ్యమైన విద్యకు, విద్యార్థుల ప్రతిభను వెలికితీసే కృషికి నిదర్శనమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

# డెకరేషన్ గూడెంలో అగ్నిప్రమాదం






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 20)

నగర పరిధిలోని ఇందిరమ్మ గృహాలను అనుకొని కొప్పోలు ఫ్లై ఓవర్ ప్రాంతంలో ఉన్న డెకరేషన్ గూడెంలో సోమవారం అగ్నిమా ప్రమాదం సంభవించింది. శుభకార్యాలకు వాడే డెకరేషన్ సామాగ్రి పెట్టుకునేందుకు ఈ గోడౌన్‌ను ఉపయోగిస్తున్నారు. షేక్ రహంతుల్లా అనే వ్యక్తి ఈ గూడెంను అద్దెకు తీసుకున్నారు. సుమారు 4 గంటల నుండి గూడెంలో నుంచి పొగలు రావడంతో స్థానికులు అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపకశాఖ అధికారులు వచ్చి మంటలను అదుపు చేసినప్పటికీ గూడెంతో పాటుగా దానిలో ఉన్న సామాగ్రి పూర్తిగా దగ్ధమైంది. దీని విలువ సుమారు రూ.40 లక్షలు పైన ఉండొచ్చు అని అంచనా వేస్తున్నారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# ఫిర్యాదు దారులకు చట్టపరిధిలో న్యాయం చేయండి

### అదనపు ఎస్పీ కె ప్రకాష్ బాబు
### ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 112 పిటీషన్లు




(షణ్ముఖ వెలుగు, కడప, జులై 20)

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదు దారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని అదనపు ఎస్పీ (అడ్మిన్) కె ప్రకాష్ బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా నలుమూలల నుండి 112 మంది అర్జీదారులు తమ సమస్యలను విన్నవించుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన ప్రజలతో అదనపు ఎస్పీ మాట్లాడి వారి ఫిర్యాదుల పై చట్టపరంగా చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులకు పోలీసు సిబ్బంది ప్రశాంతంగా తమ సమస్యను వివరించడానికి సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ ఎన్ సుధాకర్, డిటిసి డిఎస్పీ అబ్దుల్ కరీం, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## సర్టిఫేకట్‌లు పోయినవి

నా పేరు మేళం నిఖిత తన్వి. నేను తేదీ **20.07.2026**వ తేదీ నాడు ఒంగోలు కోర్ట్ సెంటర్ పరిసర ప్రాంతంలో బైక్ పై వెళుతున్న క్రమంలో నా ఒరిజినల్ ఇంటర్, టిసి మరియు స్టడీ సర్టిఫికెట్లను పోగొట్టుకున్నాను. ఎవరికైనా దొరికిన యెడల దయచేసి క్రింది నెంబర్‌కు తెలియజేయగలరు.

సంప్రదించవలసిన నెంబర్ :
**8885456544**

# గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వమే నేరుగా వేతనాలు ఇవ్వాలి

## పెండింగ్ వేతనాలు చెల్లించాలని 30న కలెక్టరేట్ వద్ద ధర్నా



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 20)**

గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రూ.4 వేలు మెడికల్ అలవెన్స్ చెల్లించాలని, పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఈ నెల 30న ఉదయం 10 గంటలకు ఒంగోలులోని జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా నాయకులు జీవీబీ కుమార్ తెలిపారు. సోమవారం ఉలవపాడు మండలంలోని, కరేడు పంచాయతీ ఆఫీస్ మస్టర్ పాయింట్ వద్ద కార్మికులతో సమావేశం అయ్యారు. జీవీబీ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోనే అత్యధిక రెవిన్యూ వచ్చే పంచాయతీ కరేడు అని, ఈ పంచాయతీ పరిధిలో 25 మంది కార్మికులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వీరికి రూ.11,500 మాత్రమే వేతనం వస్తుందని తెలిపారు. మార్చి నెలలో కార్మికులకు ఇచ్చిన యూనిఫామ్ కూడా ఇంకా కొంతమందికి ఇవ్వకుండా పెండింగ్‌లో ఉంచడం శోచనీయం అన్నారు. ప్రకాశం జిల్లా అంతటా రూ.15 వేలకు తగ్గకుండా పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇస్తున్నారని, కరేడు లో అతి తక్కువగా ఇస్తున్నారని, కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని పేర్కొన్నారు. 17 వేల మంది జనాభా వదిలిన మలినాలన్నీ రోజు ఉదయాన్నే శుభ్రం చేసి, ప్రజలందరూ అనారోగ్యం పాలవకుండా చూస్తున్న పంచాయతీ కార్మికుల పట్ల, పై అధికారులు అశ్రద్ధ వహించటం సిగ్గుచేటు అన్నారు. కనీసం గుర్తింపు కార్డులు కూడా లేకపోవడం అన్యాయమన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 30న ఒంగోలుకు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్మికులు ఈ తిరుపాలు,జీ రాజశేఖర్, ఎండ్లూరి నల్ల కోటయ్య, జి శేఖర్, సిహెచ్ వెంకట రమణయ్య, గడ్డం బాలయ్య, కరేటి రోజమ్మ, సుమలతమ్మ, కోటేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధ దంపతుల ఘటనలో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం

## మైదుకూరు డిఎస్పీ జి రాజేంద్రప్రసాద్



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 20)**

బద్వేలు పట్టణంలోని మార్తోమా నగర్‌లో ఉన్న 3 సెంట్ల ఇంటి స్థలానికి సంబంధించి బద్వేలుకు చెందిన పిన్నం వెంకటయ్య, ప్రొద్దుటూరుకు చెందిన అయ్యవారమ్మ, తదితరుల మధ్య కొంతకాలంగా భూ వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో 18వ తేదీ సాయంత్రం పిన్నం వెంకటయ్యకు, సదరు స్థలాన్ని అయ్యవారమ్మ వద్ద కొనుగోలు చేసినట్లు చెప్పబడుతున్న కడపకు చెందిన బొజ్జా తిరుమలేష్ తదితరుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సంఘటన సమాచారం అందుకున్న వెంటనే బద్వేలు టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి, ఇరువర్గాలను అక్కడి నుండి పంపించి శాంతిభద్రతలను పునరుద్ధరించారు. ఈ ఘటనకు సంబంధించి బద్వేలు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోంది. దర్యాప్తులో వెలుగులోకి వచ్చే వాస్తవాల ఆధారంగా సంబంధిత వ్యక్తుల పై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. అయితే ఈ భూ వివాదానికి సంబంధించిన సంఘటనను వక్రీకరిస్తూ, ఒక మహిళ రవిక (జాకెట్) చించి ఆమెను అవమానించినట్లు కొన్ని ప్రసార మాధ్యమాలు, ముఖ్యంగా ఒక టెలివిజన్ ఛానల్, అలాగే సామాజిక మాధ్యమాల్లో వీడియోలు ప్రసారం చేయడం జరిగింది. పోలీసుల విచారణ మేరకు పై ఘటన లోని మహిళ దుస్తులు చింపడం గానీ, ఎలాంటి అవమానకరమైన చర్య గానీ జరగలేదు. ఈ ప్రచారం నిరాధారం, వాస్తవాలకు విరుద్ధమైంది. భూ సంబంధిత వివాదాన్ని వక్రీకరించి, మహిళ గౌరవానికి భంగం కలిగించినట్లు తప్పుడు ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో అనవసర అపోహలు, విద్వేషాలు నెలకొనే అవకాశం ఉంది. ఇటువంటి అసత్య, కల్పిత, రెచ్చగొట్టే కథనాలను ప్రసారం చేయడం లేదా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం చట్టరీత్యా శిక్షార్హమైన చర్య అని మైదుకూరు డిఎస్పీ జి రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. ప్రజలు, మీడియా ప్రతినిధులు ఎలాంటి సమాచారాన్ని అయినా సంబంధిత అధికారుల ద్వారా ధృవీకరించుకున్న తర్వాత ప్రచారం చేయాలని, నిరాధార వార్తలను విశ్వసించకుండా, వాటిని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# వరల్డ్ జంప్ డే సందర్భంగా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జులై 20)**

మండలంలోని నూతలపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అధ్వర్యంలో డాక్టర్ చంద్రశేఖర్,డాక్టర్ దేవరకొండ శ్రీనివాసరావు పర్యవేక్షణలో వరల్డ్ జంప్ డే సందర్భంగా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం మరియు ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రోజూ ఒక 5-15 నిముషాలు జంప్ చేయడం వల్ల మన దేహంలో ఉన్న ప్రతి కండరం, జాయింట్ కదలించబడతాయని తద్వారా శారీరక దృఢత్వం పెరుగుతుందని, దూకడం అనేది ఒక అద్భుతమైన వ్యాయామమని, ఇది శరీరంలో క్యాలరీలను వేగంగా కరిగిస్తుందని, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని, శరీర సమతుల్యతను పెంచి, ఎముకలను, కండరాలను మరియు కీళ్లను బలోపేతం చేయడానికి సహాయపడుతుందని, అంతేకాకుండా శరీరంలో ఫీల్-గుడ్ హార్మోన్లు విడుదలవుతాయాని, దీనివల్ల ఒత్తిడి, ఆందోళన తక్షణమే తగ్గి మూడ్ రిఫ్రెష్ అవుతుందని, తద్వారా మనలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి, మన ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం నూతలపాడు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ దేవరకొండ శ్రీనివాసరావు విద్యార్థులకు ఉచిత ఆయుర్వేద మందులు పంపించేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, విద్యార్థినీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# పుట్టినరోజును పరోపకారంగా మార్చిన దినేష్ రెడ్డి దంపతులు

## భాను కుటుంబానికి యువ కేర్ వెల్ఫేర్ సొసైటీ చేయూత

**(షణ్ముఖ వెలుగు, కంభం, జూలై 20)**

కంభం పట్టణానికి చెందిన పుట్టుకతోనే శారీరక వికలాంగురాలైన భాను కుటుంబానికి యువ కేర్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. దినేష్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన దంపతుల సహకారంతో ఒక నెలకు సరిపడే నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయాన్ని అందజేశారు. భాను తన భర్త హఫీజ్‌తో కలిసి కంభంలో నివసిస్తున్నారు. హఫీజ్ తోపుడు బండిపై చికెన్ పకోడాలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. అయితే భాను, వారి ఏడాది వయస్సు గల చిన్నారి ఇద్దరూ అనారోగ్యానికి గురికావడంతో హఫీజ్ ఉపాధిని కొనసాగించలేక ఇంటి వద్దే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కుటుంబ ఆదాయం పూర్తిగా నిలిచిపోవడంతో రోజువారీ అవసరాలు కూడా తీర్చుకోలేని దుస్థితిలో కుటుంబం పడింది. ఈ విషయాన్ని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో) హబీబ్ ఖాన్ గుర్తించి యువ కేర్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు ఆరీఫుద్దీన్ కి తెలియజేశారు. అనంతరం ఆరీఫుద్దీన్ స్వయంగా కుటుంబ పరిస్థితిని పరిశీలించి, వారు అత్యవసర సహాయానికి అర్హులని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో యూకేలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న తన మిత్రుడు దినేష్‌రెడ్డికి, ఆయన సతీమణి సౌజన్యకి విషయం వివరించగా, దినేష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఈ కుటుంబానికి చేయూత అందించాలని వారు ముందుకు వచ్చారు. వారి సహకారంతో ఒక నెలకు సరిపడే నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయం అందజేశారు. సహాయం అందుకున్న భాను కుటుంబం యువ కేర్ వెల్ఫేర్ సొసైటీ, దినేష్‌రెడ్డి, సౌజన్య దంపతులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో యువ కేర్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు హబీబ్ ఖాన్, కరీముల్లా, అల్లూరి, కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువ కేర్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు ఆరీఫుద్దీన్ మాట్లాడుతూ సమాజంలో ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడమే మా లక్ష్యం. ఇలాంటి సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలు, శ్రేయోభిలాషులందరికీ మా హృదయపూర్వక ధన్యవాదాలు అని తెలిపారు.






# వైద్యశాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు

## డాక్టర్ దాసరి చంద్రశేఖర్



**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జులై 20)**

మండలంలోని ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాల రోగులకు మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు పర్చూరుకి చెందిన రిటైర్డ్ కోర్ట్ జూనియర్ అసిస్టెంట్ విసిహెచ్ బసవయ్య తన స్వయంగా సొంత నిధులతో వైద్యశాలకు అవసరమైన వన్ డ్రామ్ బాటిల్స్‌ను సోమవారం వైద్యాధికారి డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అందించారు. ఈ సందర్భంగా సిహెచ్ బసవయ్య మాట్లాడుతూ వైద్యశాల అధికారి డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అందిస్తున్న ఉత్తమ వైద్య సేవలను గుర్తిస్తూ, వారి సేవలను రోగులకు మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు వైద్యశాల అవసరాలను గుర్తించి స్వచ్ఛందంగా ముందుకొచ్చి వైద్యశాలకు అవసరమైన వన్ డ్రామ్ బాటిల్స్ ను ఉచితంగా అందించినట్లు తెలిపారు. డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో తాము సేవలను గుర్తిస్తూ ప్రజలు చూపిస్తున్న ఈ ప్రేమాభిమానాలు, వారి అందిస్తున్న సహాయ సహకారాలకు తాను ఎల్లప్పుడూ కృతజ్ఞుడనై ఉంటానని, తద్వారా ప్రజలకు ఇంకా మెరుగైన వైద్య సేవలు అందిస్తానని తెలుపుతూ, ఈ సహాయాన్ని అందించిన జూనియర్ అసిస్టెంట్ బసవయ్య సేవగుణాన్ని, దాతృత్వాన్ని ప్రజల ముందు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉప్పుటూరు వైద్యశాలకు వచ్చిన రోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికుల సౌకర్యాల పై ఆర్టీసీ అవగాహన కార్యక్రమం

## బస్‌స్టేషన్‌లో కల్పిస్తున్న సౌకర్యాలపై కరపత్రాల పంపిణీ

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 20)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ప్రయాణికులకు ఆనందకరమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు కనిగిరి డిపోలో సోమవారం బస్సుల్లోనూ, డిపో ఆవరణలోనూ ప్రయాణికులకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం మాట్లాడుతూ బస్ స్టేషన్‌లో ప్రయాణికుల కోసం ఆర్‌ఓ ప్లాంట్ ద్వారా స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం, సౌకర్యవంతమైన సీటింగ్, ఫ్యాన్లు, లైటింగ్, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, సమాచార కేంద్రం, టికెట్ బుకింగ్ సౌకర్యం, బస్సుల రాకపోకల వివరాల పట్టిక, దివ్యాంగుల కోసం వీల్‌చైర్, స్టాల్స్, పార్కింగ్ వంటి పలు సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. అలాగే 'స్త్రీ శక్తి' పథకంలో భాగంగా మహిళా ప్రయాణికులకు అత్యవసర పరిస్థితుల్లో గుడ్ హెల్ప్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత శానిటరీ న్యాప్‌కిన్స్‌ను డిపోలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. బస్ స్టేషన్‌లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కరపత్రాల ముద్రణకు సహకరించిన పివిఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ పి వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ పిల్లి ప్రతాప్ రెడ్డిలకు డిపో మేనేజర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్‌తో పాటు పివిఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ పి వెంకటేశ్వరరెడ్డి, డిపో అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# పి4లో భాగంగా హస్తకళాకారుల సాధికారతకు చౌపాల్ కార్యక్రమం

## 120 మంది గ్రామీణ హస్తకళాకారుల నమోదు

## ప్రభుత్వ పథకాలు, మార్కెట్ అవకాశాలపై అవగాహన







(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జూలై 20)

స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనలో భాగంగా పి4 కార్యక్రమం ద్వారా గ్రామీణ హస్తకళాకారులను ప్రోత్సహించి వారి జీవనోపాధిని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో, భారత ప్రభుత్వ అభివృద్ధి కమిషనర్ (హస్తకళలు) కార్యాలయం, హస్తకళల సేవా కేంద్రం, తిరుపతి సహకారంతో సోమవారం మైదుకూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయంలో చౌపాల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వోనిపెంట, పెద్దసెట్టిపల్లి, అక్కులాయపల్లి గ్రామాలకు చెందిన సుమారు 120 మంది హస్తకళాకారులు హాజరై నూతన కళాకారులుగా నమోదు చేసుకున్నారు. ఈ నమోదు ద్వారా ప్రభుత్వ హస్తకళల సంక్షేమ పథకాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, ఆర్థిక సహాయం, మార్కెటింగ్ సదుపాయాలు, జాతీయ స్థాయి ప్రదర్శనల్లో పాల్గొనే అవకాశాలు, అలాగే ఇతర ప్రోత్సాహకాలు పొందేందుకు వీలు కలుగుతుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మైదుకూరు ఎంపీడీఓ కెవి శ్రీధర్ నాయుడు, యంగ్ ప్రొఫెషనల్ వినోద్ కుమార్ పువ్వాడి మాట్లాడుతూ, వికసిత్ భారత్ మరియు స్వర్ణాంధ్ర 2047 ఆశయాలకు అనుగుణంగా ఒక కుటుంబం–ఒక పరిశ్రామికవేత్త అనే లక్ష్య సాధనలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని హస్తకళాకారులను గుర్తించి, ప్రభుత్వ పథకాలతో అనుసంధానం చేయడంతో పాటు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలను కల్పించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. అదేవిధంగా, సంప్రదాయ హస్తకళలను పరిరక్షించడంతో పాటు వాటిని ఆధునిక మార్కెట్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు. పి 4 కార్యక్రమం ద్వారా ప్రభుత్వ శాఖలు, ఆర్థిక సంస్థలు, మార్గదర్శులు, ప్రజల భాగస్వామ్యంతో గ్రామీణ కుటుంబాలను స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించడం స్వర్ణాంధ్ర 2047లో నిర్దేశించిన ప్రధాన లక్ష్యాలలో ఒకటని వివరించారు. ఈ కార్యక్రమంలో పి 4 మార్గదర్శి, ఓనిపెంట బ్రాస్ ఇండస్ట్రీ అధ్యక్షులు ఇస్మాయిల్, హస్తకళల సేవా కేంద్రం, తిరుపతి ప్రాంతీయ సహాయ మేనేజర్ వినోద్ దెహారు, లేపాక్షి మేనేజర్ ఎఫ్ఎం హుస్సేన్ (కడప), ఎస్‌బీఐ ఓనిపెంట శాఖ మేనేజర్ నాగరాజు, తదితరులు పాల్గొని హస్తకళాకారులకు ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణ సదుపాయాలు, మార్కెటింగ్ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, హస్తకళల అభివృద్ధికి అందుబాటులో ఉన్న సేవల పై సమగ్ర అవగాహన కల్పించారు.

# జీవో 396ను రద్దు చేయాలని లేఖర్ల పెన్ డౌన్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 20)

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెంబర్ 396 ను రద్దు చేయాలని దస్తావేజు లేఖర్లు స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయం ఆవరణలో సోమవారం పెన్ డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ దస్తావేజు లేఖర్లు సుబ్బారావు, మస్తాన్ లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన సేవలతోపాటు కక్షిదారుల సొంత వ్యవహారమైన దస్తావేజుల తయారీ విధానమును రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలకు అప్పగిస్తూ జారీ చేసిన జీవో నెంబర్ 396 ను రాష్ట్రంలోని దస్తావేజు లేఖర్లు అందరూ వ్యతిరేకిస్తున్నారని కావున దీనిని వెంటనే రద్దు చేయాలని కోరారు. అంతేకాకుండా ఎంతోమంది నిరుద్యోగులు సంవత్సరాల తరబడి లేఖర్ల వృత్తిలో కొనసాగుతూ లక్షల మంది జీవనం సాగిస్తున్నారని జీవో నెంబర్ 396 ను అమలుపరిస్తే అందరూ రోడ్డున పడాల్సిన దుస్థితి వస్తుందని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ఈ జీవ ప్రకారం రిజిస్ట్రేషన్లు జరిగితే కక్షిదారులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. కార్పొరేట్ రిజిస్ట్రేషన్స్ మాకొద్దు, కాగితాల రిజిస్ట్రేషన్ మాకు ముద్దు అంటూ నినాదాలు చేశారు. దస్తావేజు లేఖర్లు అందరికీ లైసెన్సులు ఇచ్చి ఇదే వృత్తిలో కొనసాగే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖర్ల అసోసియేషన్ అధ్యక్షులు షేక్ హుస్సేన్ పీరా, కార్యదర్శి పిన్నిగా శివ, తదితర మార్కాపురంలోని దస్తావేజు లేఖరులందరూ పాల్గొని పెన్‌డౌన్ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్న అనిల్ కుమార్



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జులై 20)

ఒంగోలులో సోమవారం జరిగిన షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ ప్రధాన ఉత్సవంలో స్థానిక ఆశ్రమ పాఠశాల విద్యార్థి తలపల అనిల్ కుమార్ కలెక్టర్ రాజాబాబు చేతుల మీదుగా రూ.20 వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందుకున్నారు. అవార్డు వచ్చినందుకు తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు అనిల్ కుమార్ కు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవిచంద్రబాబు, ప్రధానోపాధ్యాయుడు పి మాధవరావు పాల్గొన్నారు

# ‘మీకోసం’ అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలి

## కలెక్టర్ పి రాజాబాబు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 20)

‘మీకోసం’ అర్జీల పరిష్కారానికి జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. సోమవారం ప్రకాశం భవనంలో నిర్వహించిన ‘ మీకోసం ’ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, డిఆర్ఓ పి వెంకటరమణ, డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఈడీ బీసీ కార్పొరేషన్ వెంకటేశ్వరరావు, విపత్తుల నిర్వహణ సంస్థ అధికారి మాధురి, తదితర అధికారులతో కలిసి ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 261 అర్జీలు వచ్చాయి. వీటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కింద స్థాయి సిబ్బంది ఇచ్చే నివేదికల పై ఆధారపడకుండా జిల్లా స్థాయి అధికారి క్షేత్రస్థాయిలో పర్యటించి ఈ అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. మీకోసం అర్జీలకు పరిష్కారం, ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్స్‌లో సానుకూల ప్రజాభిప్రాయం పెంపు కోసం ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నందున అధికారులు కూడా ఇదే స్ఫూర్తితో మరింత చురుకుగా పనిచేయాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. మీకోసం అర్జీలకు సకాలంలో సహేతుక పరిష్కారం చూపాలని ఆయన స్పష్టం చేశారు. రెవెన్యూ సంబంధిత అంశాలను ఎప్పటికప్పుడు పరిష్కరించి వివరాలను అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





# జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్న సకినాల చందన




(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జూలై 20)

2025–2026 విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి షైనింగ్ స్టార్ అవార్డ్స్ 2026కు ఎంపికైన కృష్ణవేణి హైస్కూల్ విద్యార్థిని సకినాల చందన మార్కాపురంలో నిర్వహించిన షైనింగ్ స్టార్ అవార్డ్స్ 2026 కార్యక్రమంలో ఘనంగా సత్కారం అందుకుంది. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, ఆర్జేడీ పి లింగేశ్వర్, డీఈఓ సామా సుబ్బారావు, ఎంఈఓ 1 ఆంజనేయులు, ఎంఈఓ 2 మల్లు నాయక్ విద్యార్థినికి ప్రశంసా పత్రం, మెడల్, రూ.20,000 నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణవేణి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజు సంగాని, డైరెక్టర్లు రామకృష్ణ, శ్రీధర్ గుప్తా, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ అబ్దుల్ రెహమాన్, వైస్ ప్రిన్సిపాల్ జెవి రామకృష్ణ, ఫ్లోర్ ఇంచార్జులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు సకినాల చందనను అభినందిస్తూ, ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కృష్ణవేణి హైస్కూల్ విద్యార్థులు విద్య, క్రీడలు, ప్రతిభా రంగాల్లో రాష్ట్ర స్థాయిలో రాణిస్తూ పాఠశాలకు మరింత గుర్తింపు తీసుకువస్తున్నారని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

# మైనర్ బాలిక కిడ్నాప్ పై ఫోక్సో, కిడ్నాప్ కేసు కట్టాలి

## 53 రోజులైనా కేసు నమోదు చేయని ఉలవపాడు ఎస్ఐని సస్పెండ్ చేయాలి

## జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూలై 20)



దళిత బాలికను కిడ్నాప్ చేసిన కిడ్నాపర్ తీపాటి వెంకట్రావుపై ఫోక్సో మరియు కిడ్నాప్ కేసు పెట్టి అరెస్టు చేయాలని 53 రోజులైనా బాలిక ఆచూకీ కనిపెట్టని చట్ట ప్రకారం సరియైన సెక్షన్లు వేయని ఉలవపాడు ఎస్ఐ సుబ్బారావును సస్పెండ్ చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య జిల్లా కలెక్టర్ రాజాబాబుకు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక ఎస్సీ ఎస్టీ ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ లో బాధిత బాలిక బంధువులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు ఉలవపాడు మండలం వీరేపల్లి గ్రామానికి చెందిన మర్లపాటి రోదియా కూతురు కిడ్నాప్ ఉలవపాడు ఎస్ఐ అలసత్వ వైఖరి, బెదిరింపులు కేసు నమోదు చేయని కాలక్షేప వైఖరి పై సమగ్రంగా జిల్లా కలెక్టరుకు వివరించారు. మే నెల 28వ తేదీన రోదియా మైనర్ కూతురును పాలకీర్తి వెంకటరావు అను బాతులు మేపుకునే జులాయి ప్రేమ పేరుతో మోసం చేసి కిడ్నాప్ చేసుకొని వెళ్ళాడన్నారు. సదరు ఈ కిడ్నాప్ ఘటనపై బాలిక తల్లి రోదియా ఉలవపాడు పోలీస్ స్టేషన్లో గత నెల మూడవ తేదీన ఫిర్యాదు చేయగా ఫోక్సో మరియు కిడ్నాప్ సెక్షన్లు కట్టకుండా మొక్కుబడిగా బాలిక కనిపించడం లేదని క్రైమ్ నెంబర్ 60/26 కేసు కట్టారన్నారు. కిడ్నాప్ కు గురైన బాలిక ఆచూకీ కనిపెట్టకుండా కిడ్నాపర్ను అరెస్టు చేయకుండా బాలిక ఆచూకీ కోసం వచ్చిన బంధువులను ఉలవపాడు ఎస్ఐ సుబ్బారావు బెదిరించి అవమానించారన్నారు. ఉలవపాడు ఎస్ఐ బెదిరింపుల పై భయపడి కందుకూరు సీఐ, కందుకూరు డిఎస్పిని బాలిక తల్లిదండ్రులు కలిసి ఫిర్యాదు చేయగా వారు కూడా ఎస్ఐ ఖాకీ కథలకు వంత పాడేరన్నారు. అంతట ఈ నెల 16వ తేదీన జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలిసి మైనర్ బాలిక కేసులో ఫోక్సో, కిడ్నాప్ కేసు కట్టకుండా తమను వేధిస్తూ బెదిరిస్తూ అవమానిస్తున్నాడని ఉలవపాడు ఎస్ఐ సుబ్బారావు పై ఫిర్యాదు చేసిన ఎస్పీ కూడా స్పందించలేదని బాలిక తల్లిదండ్రులు బాలిక బంధువులు సోమవారం తమ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారన్నారు. స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే కందుకూరు డిఎస్పి బాలసుబ్రమణ్యంతో ఫోన్లో మాట్లాడి వెంటనే కేసు నమోదు చేయాలని కిడ్నాపర్‌ను అరెస్టు చేయాలని ఆదేశించారన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పత్రా బంగారం, దేవరపల్లి గోపి రవి, తదితరులు ఉన్నారు.

## పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ





(షణ్ముఖ వెలుగు, కంభం జులై 20)

స్థానిక ఎస్ఎస్ఏ యూపీ స్కూల్, ఎన్ఎన్‌లో ఎస్‌జిటిగా విధులు నిర్వహిస్తున్న పివి మురళీమోహన్ తన 54వ పుట్టినరోజు సందర్భంగా సోమవారం ఈసీ కందులాపురం పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలకలు, నోట్‌బుక్స్, అద్దాలు, దువ్వెనలు, వాటర్ క్యాన్లను అందజేసి విద్యార్థుల పట్ల తన సేవాభావాన్ని చాటుకున్నారు. పుట్టినరోజును ఆడంబరాలకు దూరంగా సమాజానికి ఉపయోగపడే విధంగా నిర్వహించడం అభినందనీయమని పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తోట కోటేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని పివి మురళీ మోహన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థుల సంక్షేమానికి ఇలాంటి సేవా కార్యక్రమాలు ఆదర్శప్రాయమని వారు పేర్కొన్నారు.

## నేటి నుండి శ్రీగిరిలో అభయాంజనేయ స్వామివారి ఆగమన ఆరాధనోత్సవాలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 20)

శ్రీగిరి క్షేత్ర పాలకుడు అభయాంజనేయ స్వామి వారి ఆగమన ఆరాధనోత్సవాలను జూలై 21 నుండి 23వ తేదీ వరకు శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 21వ తేదీ మంగళ వారం ఉదయం అభయాంజనేయ స్వామి వారికి అభిషేకం, భక్తులచే 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ, సాయంత్రం అభయాంజనేయ స్వామి వారికి అర్చన, 6.30 లకు ఊంజల సేవ, శ్రీగిరి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసులు మధుర గాయక వివిఎస్ వినోద్ కుమార్ చే గాత్ర కచేరీ జరుగుతాయి. 22వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు హనుమత్ యాగం, పూర్ణాహుతి, సాయంత్రం 6.30 గంటలకు భక్తులచే విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహిస్తారు. 23వ తేదీ గురువారం ఉదయం 6 గంటలకు ములుకుట్ల సుబ్రహ్మణ్యశర్మ చే సుందరకాండ పారాయణ జరుగుతుంది. అభయాంజనేయ స్వామి వారి ఆగమన ఆరాధనోత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలాదేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సివి రామకృష్ణారావు, ధర్మకర్తల మండలి ప్రతినిధులు కోరారు.

## టీడీపీ నాయకులు సుంకర కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ఇంటూరి



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 20)

మండలంలోని కరేడు గ్రామ టిడిపి నాయకులు సుంకర చెంచురామిరెడ్డి తల్లి రమణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం చెంచురామిరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన పరామర్శించారు. అనంతరం స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారం పై అక్కడికక్కడే అధికారులతో మాట్లాడారు.

# సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యమివ్వాలి

### వినుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ మీసాల మురళీకృష్ణ

(షణ్ముఖ వెలుగు, నూజండ్ల, జూలై 20)

పురుగుమందుల, ఎరువుల షాపుల యజమానులు, రైతు సేవా కేంద్రాల సహాయకులకు మీ యాప్ పై నూజండ్ల రైతు సేవా కేంద్రంలో కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వినుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ మీసాల మురళీకృష్ణ యాదవ్ హాజరై మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించి ప్రకృతి సహజ సిద్ధమైన ఎరువులను వాడాలని రైతులకు పిలుపునిచ్చారు. అధికంగా రసాయనాలు వాడటం వల్ల భూసారం క్షీణించడమే కాకుండా భవిష్యత్తులో ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వ్యవసాయ రంగంలో అనేక మార్పులు తీసుకువచ్చిందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను ఎరువులు, రాయితీ డ్రిప్పు స్లింకర్స్ ఉద్యానవన మొక్కలు యంత్ర పరికరాలు వంటి పథకాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వినుకొండ శాసనసభ్యులు ప్రభుత్వ చీఫ్ జీవీ ఆంజనేయులు పల్నాడు జిల్లాలో హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నూజెండ్ల మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ఆంజనేయులు నాయక్, నూజెండ్ల సొసైటీ అధ్యక్షులు బచ్చు అంజిరెడ్డి, నూజెండ్ల ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గుడివాడ ఆంజనేయులు, ఎరువుల షాపుల యజమానులు, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.





# పుట్టా పోలమ్మ చిత్రపటానికి ఏపీసీవోబీ, డీసీసీబీ చైర్మన్ల ఘన నివాళి



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జూలై 20)

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాతృమూర్తి, ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ నానమ్మ స్వర్గీయ పుట్టా పోలమ్మ చిత్రపటానికి పలువురు రాష్ట్ర స్థాయి నాయకులు, ప్రజా ప్రతినిధులు పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. సోమవారం మైదుకూరులోని ఎమ్మెల్యే నివాస ప్రాంగణంలో ఆప్కాబ్ (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్) చైర్మన్ గన్ని వీరాంజనేయులు , కడప జిల్లా డీసీసీబీ చైర్మన్ , బద్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సూర్యనారాయణరెడ్డి ప్రత్యేకంగా హాజరై, స్వర్గీయ పోలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వర్గీయ పుట్టా పోలమ్మ క్రమశిక్షణ, సద్గుణాలు కలిగిన వ్యక్తి అని, కుటుంబానికి దిశానిర్దేశం చేస్తూ ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని వారి పవిత్ర స్మృతులను స్మరించుకున్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌ని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యాన్ని నింపే ప్రయత్నం చేశారు. పోలమ్మ మృతి పుట్టా కుటుంబానికే కాకుండా నియోజకవర్గానికి కూడా తీరని లోటని పేర్కొంటూ తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీసీవోబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డితో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, తెలుగుదేశంపార్టీ నాయకులు, కూటమి శ్రేణులు, వివిధ సంఘాల నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

## గర్భవతులకు పోషకాహార కిట్ల పంపిణీ



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జులై 20)

మండలంలోని సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సంతరావూరు గ్రామంలో సోమవారం గర్భవతులకు, బాలింతలకు ప్రధానమంత్రి పోషణ అభియాన్‌లో భాగంగా 42 పోషకాహార కిట్లను ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె కీర్తి సరోజ్ అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కె కీర్తి సరోజ్ మాట్లాడుతూ పోషకాహార కిట్‌ల ద్వారా గర్భిణీ స్త్రీ, బాలింతలలో రక్త హీనత తగ్గుతుందని పోషక విలువలు పెరిగి తద్వారా కాన్పు సులభతరం అవుతుందని తెలిపారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని మిగిలిన గ్రామాలలో త్వరలోనే ఈ కిట్‌లను అందచేస్తామని తెలియాజేసారు. కార్యక్రమంలో సూపర్వైజర్ వి వెంకటరమణ, శ్రీధర్, వరదానం, ఎఎన్ఎమ్ శాంతకుమారి, ఆశాలు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడమే లక్ష్యం

### 'మీ కోసం' కార్యక్రమాన్ని నిర్వహించిన మార్కాపురం జిల్లా పోలీసులు

### ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 60 ఫిర్యాదులు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 20)

ప్రజల నుండి వచ్చే వివిధ రకాల ఫిర్యాదులను పరిష్కారించుటయే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు మార్కాపురం జిల్లా ఓఎస్డీ (అడ్మిన్) నవజ్యోతి మిశ్రా, పోలీసు అధికారులతో కలిసి సోమవారం మార్కాపురం జిల్లా పోలీసు కార్యాలయంలో "మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమగ్రంగా విచారణ జరిపి, ఫిర్యాదుదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని ఓఎస్డీ (అడ్మిన్) ఆదేశించారు. వివిధ సమస్యలతో పోలీసు కార్యాలయాలకు వచ్చే బాధితులకు పోలీసు శాఖ భరోసాగా నిలవాలని, ప్రతి ఫిర్యాదును నమోదు చేసి, నిర్ణీత గడువులో పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఫిర్యాదుల కోసం వచ్చే వృద్ధులు, దివ్యాంగులు, నడవలేని స్థితిలో ఉన్నవారికి ప్రత్యేక శ్రద్ధతో స్పందించి, వారి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు తమ ఫిర్యాదులను సమీపంలోని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో కూడా అందజేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా సివిల్, భూ, ఆర్థిక తగాదాలు, చీటింగ్, జాబ్ ఫ్రాడ్, అత్తరింటి వేధింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు, మార్కాపురం సీఐ అల్తాఫ్ హుస్సేన్, త్రిపురాంతకం సిఐ అస్సన్, టీవీపల్లి ఎస్ఐ శివ బసవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కోసం ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పుకోవద్దు

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూలై 20)

సమస్యల పరిష్కారం కోసం ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పుకోవద్దని జిల్లా కలెక్టర్ .పి. రాజాబాబు స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆర్థికేతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం ప్రకాశం భవనంలో ఎస్సీ, ఎస్టీల కోసం నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీమతి కల్పనా కుమారి, డిఆర్ఓ పివి రమణ, ఆర్డిఓ చంద్రశేఖర్ నాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్ రెడ్డి, స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావులతో కలిసి ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంలో నాణ్యత అత్యంత ముఖ్యమన్నారు. బలహీన వర్గాల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊరుకోనని చెప్పారు. రెవెన్యూయేతర సమస్యలపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ప్రత్యేకంగా విచారించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రీవెన్స్ అర్జీలను పరిష్కరిస్తున్న తీరుపై ప్రజల నుంచి ప్రభుత్వం క్యూఆర్ కోడ్ ద్వారానూ, ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారానూ అభిప్రాయం సేకరిస్తున్నందున ప్రజలతో వ్యవహరించే విధానం, సమస్యలను పరిష్కరిస్తున్న పద్ధతి సక్రమంగా ఉండాలన్నారు. గ్రీవెన్స్ కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని గుర్తెరిగి అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులందరూ ప్రతిరోజు ముందుగా ఆన్లైన్లో గ్రీవెన్స్ అర్జీల స్టేటస్ గమనించాలని కలెక్టర్ చెప్పారు. సాంకేతిక కారణాల వలన పరిష్కరించలేని సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# గుండ్లకమ్మ ప్రాజెక్టు మంచినీటి భూముల్లో అక్రమ రొయ్యలు చాపల చెరువుల సాగుదారులను అరెస్టు చేయాలి

**లైసెన్సు ఉన్న వారిని ప్రాజెక్టులో చేపల వేటకు అనుమతించాలి**
**జాయింట్ కలెక్టర్ ఇచ్చే ప్రాజెక్టు భూముల్లో అక్రమ ఆక్వా సాగుపై విచారణ జరిపించాలి**
**జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన దళిత నేత నీలం నాగేంద్ర**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూలై 20)**

కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్టుకు డబ్బులు తీసుకొని భూములు ఇచ్చిన భూస్వాములు మరల సదరు భూములు ప్రభుత్వ స్వాధీనంలో ఉండగానే వేరే జిల్లాల ఆక్వా సాగు వ్యాపారులకు లీజుకి ఇచ్చారని అందువలన గుల్లకమ్మ ప్రాజెక్టు మంచినీళ్లు కలుషితమవుతున్నాయని ప్రజలకు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వ్యాధుల బారిన పడుతున్నారని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు సోమవారం కలెక్టరేట్లో జరిగిన ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్లో జిల్లా కలెక్టర్ రాజా బాబుకు ఫిర్యాదు చేశారు. ప్రకాశం జిల్లా మంచినీటి ప్రాజెక్టు అయిన గుల్లకమ్మ ప్రాజెక్టులో మద్దిపాడు, కొరిసపాడు, తాళ్లూరు, అద్దంకి, ముళ్ళమూరు, చీమకుర్తి మండలాల గ్రామాల పరిధిలో గుండ్లకమ్మ ప్రాజెక్టు విస్తరించి ఉందన్నారు. అందులో 1200 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ లు మత్స్యశాఖ ద్వారా లైసెన్సులు పొంది గొల్ల కమ్మ ప్రాజెక్టులో చేపల వేట కొనసాగిస్తూ జీవిస్తున్నారన్నారు. గత 5, 6 సంవత్సరముల నుండి కృష్ణాజిల్లా, నెల్లూరు జిల్లాల నుండి 250 మంది బీసీ కులానికి చెందినవారు లైసెన్సులు లేకుండా వచ్చి అక్రమంగా చేపల వేట కొనసాగిస్తున్నారన్నారు. లైసెన్సు కలిగిన స్థానికులు వేటాడి మత్స్య సంపద రేట్లు స్థానిక అధికార పార్టీ అగ్రకుల నాయకులు నిర్ణయిస్తూ చేపల వేట చేసే స్థానికులను బెదిరిస్తూన్నారు ఈ క్రమంలో మరల గుల్లకమ్మ ప్రాజెక్టు భూసేకరణలో ప్రభుత్వానికి భూములు ఇచ్చి నష్టపరిహారం పొందిన భూస్వాములు తిరిగి అదే భూములను ఇతర జిల్లాలకు చెందిన వారికి లీజులకు ఇచ్చి అక్రమ ఆక్వా సాగు చేస్తున్నారన్నారు. ఈ ఆక్వా సాగులో కోడి వ్యర్థాలను, చాపలను మురగబెట్టి వ్యర్థ పదార్థాలను కలిపి చేపల చెరువులలో మేతగా వేయటం వలన గులకమ్మ మంచినీటి చెరువులోకి ఈ చేపల చెరువుల వేస్ట్ వాటర్ ను వదలటం వలన మంచినీరు కలుషితమై ప్రజలు వ్యాధులు బారిన పడుతున్నారన్నారు. స్థానికేతరులు అక్రమ ఆక్వా సాగు చేస్తున్నవారు లైసెన్స్ లేని చేపల వేటగాళ్లు స్థానిక లైసెన్సులు ఉన్న ఎస్టి యానాదులను బెదిరించి వారి జీవనోపాధికి తూట్లు పొడుస్తున్నారన్నారు. ఈ అక్రమ ఆక్వా సాగు అక్రమ చాపల వేట జిల్లా మత్స్యశాఖ, ఇరిగేషన్, రెవెన్యూ, మండల అభివృద్ధి అధికారులకు పంచాయతీ అధికారులకు తెలిసిన మామూళ్ల మత్తులో ఈ అక్రమ ప్రకృతి పర్యావరణ చట్టాలను పట్టించుకోకుండా అక్రమ వలసదారులకు సాగుదారులకు గొడుగు పడుతున్నారన్నారు. కావున జిల్లా జాయింట్ కలెక్టర్ ఇచ్చే గుల్లకమ్మ ప్రాజెక్టు పరిధిలో జరుగుతున్న అక్రమ ఆక్వా సాగు లైసెన్స్ లేని చాపల వేట దారులను కట్టడి చేసేందుకు ప్రభుత్వం నుండి డబ్బులు తీసుకొని భూములు ఇచ్చి మళ్లీ అదే భూముల్ని ప్రభుత్వ స్వాధీనంలో ఉన్నాయి. అయినప్పటికీ లక్షల రూపాయలు తీసుకొని లీజులకు ఇస్తూ గుల్లకమ్మ మంచినీటి ప్రాజెక్టును వ్యర్థాలతో కలుషితం చేస్తున్న ప్రజారోగ్యాన్ని నాశనం చేస్తున్న వారి పై కేసులు నమోదు చేయించి ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకోవాలన్నారు. లైసెన్సులు లేకుండానే చేపల వేటాడుతున్న ఇతర జిల్లాల వారిని కూడా అరెస్టు చేయాలని జిల్లా కలెక్టర్ రాజా బాబుకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య, పోలా జీవరత్నం, మేకల ఆదినారాయణ, మెలిక శ్రీను, పామూరు సిద్దయ్య, తదితరులు ఉన్నారు.




## నియోజకవర్గంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ విస్తృత పర్యటన

**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జూలై 20)**

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఈ నెల 21వ తేదీ మంగళవారం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించనున్నారు. రైతాంగానికి, ప్రజలకు సాగు నీరు, తాగు నీరు అందించే లక్ష్యంతో పలు ప్రాజెక్టుల ద్వారా నీటిని విడుదల చేసే కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు బ్రహ్మంగారి మఠంలోని బ్రహ్మం సాగర్ ప్రాజెక్టు లెఫ్ట్ కెనాల్ నుండి రైతులకు సాగునీటిని అధికారికంగా విడుదల చేయనున్నారు. సాయంత్రం 4 గంటలకు మైదుకూరు మండలం లెక్కలవారిపల్లె సమీపంలోని ఎస్ఆర్ 2 నుండి మైదుకూరు చెరువులకు నీటిని విడుదల చేసే కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రజా ప్రయోజనాలే ధ్యేయంగా జరుగుతున్న ఈ కార్యక్రమాల్లో మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని మండల టీడీపీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాలను కవర్ చేసి విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

## మద్యం మత్తులో కరెంటు స్తంభాన్ని ఢీ కొట్టిన బస్సు డ్రైవర్ మహిళకు స్వల్ప గాయాలు



**(షణ్ముఖ వెలుగు, సంతనూతలపాడు, జూలై 20)**

ఒంగోలు సరస్వతి జూనియర్ కాలేజ్ చెందిన బస్సు సోమవారం ఉదయం వేములపాడు నుండి చిలకపాడు వస్తుండగా సైడ్ న ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీ కొట్టడంతో స్తంభం విరిగిపడినది. అదృష్టవశాత్తు తీగలు కింద పడలేదు. ఈ యాక్సిడెంట్ లో బస్సులో ఉన్న ఉద్దండము వెంకట మహాలక్ష్మి మహిళకు



స్వల్ప గాయాలు మరికొందరికి చిన్న చిన్న గాయాలయ్యాయి స్థానికులు తెలిపారు, డ్రైవర్ మద్యం మత్తులో ఉండడం వల్ల ఇలా జరిగిందని ప్రాథమిక సమాచారం, సంఘటన స్థలానికి సంతనూతలపాడు ఎస్ఐ వివరాలు సేకరించారు.

# నీట్ అక్రమాల పై కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

**సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ, నిరసన**
**సోనం వాంగ్‌చుక్ దీక్షకు సంఘీభావం**







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూలై 20)**

నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఢిల్లీలో ప్రముఖ సామాజికవేత్త సోనం వాంగ్‌చుక్ చేపట్టిన దీక్షకు, సీజేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆందోళనకు సంఘీభావం తెలుపుతూ సోమవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలులో ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహించారు. సుందరయ్య భవన్ నుంచి కర్నూలు రోడ్డుమీదుగా నినాదాలతో సాగిన ర్యాలీ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని సాగర్ హోటల్ సెంటర్‌కు చేరుకుని నిరసన కార్యక్రమం చేపట్టారు. నీట్ అక్రమాల పై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కార్యకర్తలు కేంద్ర విద్యాశాఖ మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు మాట్లాడుతూ, నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన అక్రమాలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం సమస్యను పరిష్కరించకుండా ఉద్యమాలను అణచివేస్తోందని విమర్శించారు. సీజేపీ నేతృత్వంలో ఎస్ఎఫ్ఐ, ఐసా తదితర విద్యార్థి సంఘాలు నిర్వహించిన 'చలో పార్లమెంట్' కార్యక్రమంపై లాఠీచార్జి, భాష్పవాయు ప్రయోగం, నీటి ఫిరంగులతో దాడి చేయడం ప్రజాస్వామ్య విరుద్ధ చర్య అని అన్నారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశంలో కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని విమర్శిస్తూ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ, ఎన్‌టీఏ, ఎన్‌సీఈఆర్‌టీల్లో ఆర్ఎస్ఎస్ భావజాలానికి చెందిన వ్యక్తులు కీలక స్థానాల్లో ఉండటంతో పరీక్షల నిర్వహణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. నీట్ అక్రమాలకు కేంద్రంగా మారిన ఎన్‌టీఏను రద్దు చేసి, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న విద్యార్థి ఉద్యమాలను అణచివేయడం మానుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ, బీజేపీ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. నీట్ తరహా పరీక్షల నిర్వహణ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో వి బాలకోటయ్య, బంకా సుబ్బారావు, నెరుసుల వెంకటేశ్వర్లు, జి రమేష్, గంటెనపల్లి శ్రీనివాసులు, కంకణాల రమాదేవి, జి ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, ఘట్టమనేని శ్రీనివాసరావు, టి రాము, వి మోజెస్, బీవీ రావు, మారెళ్ల సుబ్బారావు, తంబి శ్రీనివాసులు, టి భక్తసింగ్‌రాజు, టి మహేష్, టీవీఆర్ సుబ్బారావు, సిహెచ్ లక్ష్మీనారాయణ, బి వెంకటరావు, దారా వెంకటేశ్వర్లు, వి మాలకొండయ్య, కే శ్రీనివాసరావు, రాజేశ్వరి, అమీర్, దామా శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా ఇంటర్ విద్యాధికారిణి స్వరూప రాణి



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 20)**

మార్కాపురం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిగా అదనపు బాధ్యతల పై నియమితులైన ఎర్రగొండపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె స్వరూపరాణి సోమవారం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీతను కలిశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో మర్యాద పూర్వకంగా కలిసి కలెక్టర్ మొక్కను సమర్పించారు. కలెక్టర్ మార్గదర్శకత్వంలో జిల్లాలో ఇంటర్మీడియట్ విద్య సర్వతోముఖ అభివృద్ధికి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభ్యున్నతికి కృషి చేస్తానని స్వరూపరాణి తెలిపారు.

## ఏళ్ళ తరబడి మూసుకుపోయిన బీసీల స్మశాన వాటిక దారికి మోక్షం కలిగించిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి





**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 20)**

పొదిలి నగర పంచాయతీ లోని చిన్న చెరువు ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా పొదిలిలోని హిందూ మతంలోని పలు బీసీ ఓసీ కులస్తులు హిందూ స్మశాన వాటికగా వినియోగించుకుంటూ వున్నారు. అయితే దానికి సరైన ఆలనా పాలనా లేక చిల్ల చెట్లతో ప్రధాన రహదారి మూసుకుని పోవడంతో ఎవరైనా చనిపోతే విశ్వనాధపురంలోని హాస్టల్ వీధులలో గుండా అనేక వ్యయ ప్రయాసలకోర్చి శవాన్ని మోసుకుని పోయే దుస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి గమనించిన స్థానిక టీడీపీ నాయకులు సమస్యను ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి దృష్టి కి తీసుకువెళ్లగా తక్షణమే స్పందించి జేసీబీతో జంగిల్ క్లియరెన్స్‌కు శ్రీకారం చుట్టారు. హిందువుల స్మశాన వాటిక యొక్క సెంటిమెంట్‌ను గమనించి సమస్య పరిష్కార దిశగా అడుగులు వేసిన కందుల నారాయణరెడ్డికి, జేసీబీ సమకూర్చిన హనుమంతరావుకు ఆ ప్రాంత ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు కొనిజేటి లక్ష్మి నారాయణ, రజక సంఘం నాయకులు మారెళ్ల రవి, యశోదరావు, కొండయ్య, బ్రహ్మయ్య, నాని, గురవయ్య, సుబ్బారావు, నరసింహ, రవణయ్య, సురేష్, నిమ్మయ్య శ్రీను, రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మార్కాపురం జిల్లా ఓఎస్డీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎంఆర్పీఎస్ ప్రతినిధులు



**(షణ్ముఖ వెలుగు, కంభం జులై 20)**

మార్కాపురం జిల్లాలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఓఎస్డీని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎంఆర్పీఎస్ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు . ఈ సందర్భంగా ఓఎస్డీకి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి షాలేం రాజ్ మాట్లాడుతూ జిల్లాలో చోటుచేసుకుంటున్న పలు సామాజిక అంశాలు, ప్రజలకు సంబంధించిన సమస్యలను ఓఎస్డీ దృష్టికి తీసుకెళ్లి చర్చించారు. దీనికి స్పందించిన ఓఎస్డీ ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ తరపున సానుకూలంగా స్పందిస్తూ, చట్టపరమైన పరిధిలో అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షులు మండాది పిటర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నేదరపల్లి జయరాజ్, సీనియర్ నాయకులు బోడిచర్ల రాజు, దారివేముల రమేష్, కువ్వారపు రాజు, వేణు ప్రతాప్, వంశీ తదితరులు పాల్గొన్నారు.


On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
9 | 21.07.26 మంగళవారం

# విద్యార్థుల ప్రతిభకు “షైనింగ్ స్టార్స్” అవార్డులు

## ప్రధానం చేసిన చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు










(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జూలై 20)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకమైన “షైనింగ్ స్టార్స్” పురస్కారాల ప్రధానోత్సవాన్ని నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా నరసరావుపేట పట్టణం భువనచంద్ర టౌన్ హాల్ నందు పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్ల అధ్యక్షతన నిర్వహించిన పరిష్కారాల ప్రధానం కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్ఎస్సీ, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించే ప్రతిభ కనబరిచిన విద్యార్థులను చీఫ్ విప్ జీవీ ఘనంగా సత్కరించి “షైనింగ్ స్టార్స్” అవార్డులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రభుత్వం గుర్తించి వారిని ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని విద్యలో ఉత్తమ ప్రతిభను కనపరుస్తూ రాణించాలని కోరారు.

# హై స్కూల్ ప్లస్ గిద్దలూరుకు నూతన లెక్చరర్లు, పిజిటి సిబ్బంది



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూలై 20)

గిద్దలూరులోని పీఎంశ్రీ హైస్కూల్ ప్లస్ పాఠశాలకు ఇటీవల ప్రభుత్వం క్వాలిఫికేషన్ ఉన్న ఉపాధ్యాయులను ప్రమోషన్ ద్వారా లెక్చరర్లుగా నియమించింది. దీంతో హైస్కూల్ ప్లస్ గిద్దలూరుకు పూర్తి సిబ్బంది నియమించబడ్డారని హైస్కూల్ ప్లస్ ప్రిన్సిపాల్ సిద్దేశ్వర శర్మ తెలిపారు. తెలుగు సబ్జెక్టుకు డాక్టర్ మొర్రి పిచ్చయ్య, ఇంగ్లీష్ సబ్జెక్టుకు అన్నపురెడ్డి శ్రీరామిరెడ్డి, ఫిజిక్స్ సబ్జెక్టుకు సింగరి రాజేంద్రప్రసాద్, కెమిస్ట్రీ సబ్జెక్టుకు వెంకాయమ్మ, మ్యాథమెటిక్స్‌కు సగీర్, బాటనీ సబ్జెక్టుకు మొరసా బాల గురవయ్య, జువాలజీ సబ్జెక్టుకు శోభారాణిలు ఇంటర్ విద్యార్థినులకు విద్యాబోధన చేస్తున్నారు. ప్రస్తుతం ఇంటర్ మొదటి సంవత్సరంలో 33 అడ్మిషన్లు, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 42 అడ్మిషన్లు మొత్తం 75 మంది విద్యార్థులతో హై స్కూల్ ప్లస్ కళకళలాడుతుందని లెక్చరర్ల బృందం తెలిపారు. ఎంపీసీ విద్యార్థినిలకు జే.ఈ.ఈ మెయిన్స్ , బైపిసి విద్యార్థినీలకు నీట్ కు సంబంధించిన ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ సిద్దేశ్వరమ్మ తెలిపారు. ఇంటర్మీడియట్ లో అడ్మిషన్ పొందడానికి ఈనెల చివరి వరకు గడువు ఉందని తెలిపారు.

# కనిగిరి కాస్మోపాలిటన్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూలై 20)

కనిగిరి కాస్మోపాలిటన్ క్లబ్ 2026 జూలై నెలకు సంబంధించిన నూతన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 2026 జూలై 19న నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం ఈ ఏకగ్రీవ ఎన్నికను అధికారికంగా ప్రకటించారు. క్లబ్‌లో మొత్తం 150 మంది సభ్యులు ఉండగా, ఎన్నికల కోసం మొత్తం 21 నామినేషన్లు దాఖలయ్యాయి. అయితే, నామినేషన్ల పరిశీలన మరియు ఉపసంహరణ గడువులోగా 12 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. అందరి ఏకాభిప్రాయంతో క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం ఇదే.....అధ్యక్షులుగా నీలిశెట్టి సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా స్థానికం తిరుపతిరెడ్డి, కార్యదర్శిగా పాలకీటి చంద్రశేఖర్, సహాయ కార్యదర్శిగా అద్దంకి రంగబాబు, కోశాధికారి గా బైరవ కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా సింగరాజు, వివిల్ నారాయణ, షేక్ ఫిరోజ్, మునగాల శ్రీహరిరెడ్డి, వాగిచర్ల వెంకటేశ్వర్లు, తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు క్లబ్ సభ్యులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

# యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూలై 20)

ప్రకాశం జిల్లా యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, పెన్షనర్స్ సంయుక్తంగా కలిసి యుటిఎఫ్ కార్యాలయం నుండి ఒంగోలు కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ పేరుతో విద్యార్థులను, టెట్ పరీక్ష ఉపాధ్యాయులను మానసిక ఇబ్బందికి గురి చేసినందుకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధా రాజీనామా చేయాలని రాష్ట్ర కార్యదర్శి ఎస్ రవి డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష లీకేజీ, పరీక్ష నుండి ఉపాధ్యాయులను మినహాయింపు ఇవ్వడంలో నిర్లక్ష్యం వైఖరి ప్రదర్శించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వైఖరికి నిరసనగా సోమవారం జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి కేంద్ర మానవ వందల శాఖామంత్రితో రాజీనామా చేయించాలని టెట్టును రద్దుచేసి ఎన్‌టిఏను రద్దుచేసి ఇలాంటి పరీక్షలు రాష్ట్రాలు నిర్వహించుకునేందుకు విధంగా అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్ముజు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కిలారి వెంకటేశ్వర్లు, షేక్ అబ్దుల్ హై, జిల్లా సహాధ్యక్షుడు వై వెంకట్రావు జిల్లా కార్యదర్శిలు నల్లూరి వెంకటేశ్వరరావు, సిహెచ్ ప్రభాకర్‌రెడ్డి, ఎం మాలకొండయ్య, ఎం సంధ్యారాణి, పి ఉషారాణి, ఝాన్సీ, హాజీరా బేగం, ఆల్ పెన్షనర్స్ జిల్లా అధ్యక్షులు జివి శేషయ్య, సీనియర్ నాయకులు డి వీరాంజనేయులు, ఏ మాలకొండయ్య, తాత వెంకటేశ్వర్లు, టీ రమణమూర్తి, ఏ మాలకొండయ్య, చింతలపాటి లక్ష్మీనారాయణ, భీమని వెంకటరత్నం, వీరయ్య, జయరాజు, కాట్రగడ్డ నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

# డాక్యుమెంట్ రైటర్స్ స్టాంప్ వెండర్స్‌కు మద్దతు తెలిపిన న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూలై 20)

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం. 396ను, ప్రైవేట్ పీపీపీ పద్ధతిలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే) ఏర్పాటును వ్యతిరేకిస్తూ కనిగిరి రిజిస్టేషన్ కార్యాలయ సమీపంలో పెన్‌డౌన్ నిరసన (నిరాకరణ, సమ్మె) చేపట్టడం జరిగింది. ఈ సమ్మెకు మద్దతుగా ప్రముఖ న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నిరసనలో భాగంగా జూలై 20వ తేదీ నుండి 31వ తేదీ వరకు (12 రోజుల పాటు) దస్తావేజు లేఖరులు తమ విధులను బహిష్కరించారన్నారు. జీవో నెం.396 వల్ల రిజిస్ట్రేషన్ సేవలు ప్రైవేట్ పరం అవుతున్నందున, ఆస్తులకు భద్రత, గోప్యత లేకుండా పోతున్నందున ఇందుకు నిరసనగా పెన్ డౌన్ చేస్తున్నారని ఆయన తెలిపారు.

# దస్తావేజు లేఖర్లకు నష్టం కలిగించే 396 జీవోను రద్దు చేయాలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూలై 20)

రిజిస్ట్రేషన్ కోసం వచ్చే కక్షి దారులకు సహాయపడే దస్తాలేఖర్లకు నష్టం కలిగించే 396 జీవోను రద్దు చేయాలని దస్తాలేఖర్ల సంక్షేమ సంఘం నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గుంటూరు రోడ్డులో గల రిజిస్టర్ కార్యాలయం వద్ద దస్తాలేఖర్ల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుండి 31వ తేదీ వరకు పెన్ డౌన్ కార్యక్రమం చేపట్టారు. రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా కొన్ని మార్పులు తీసుకొచ్చి రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను తీసుకొస్తున్నారని దీనివలన కక్షదారులకి నష్టదాయకంతో పాటుగా రిజిస్ట్రేషన్లు నమ్ముకుని జీవనం సాగిస్తున్న దస్తాలేఖర్లకు కూడా నష్టం కలుగుతుందని అన్నారు. ఒక రిజిస్టర్ కావాలి అంటే దస్తాలేఖరి అనేక రకాలుగా పక్షిదారులకు సేవలు అందించి పూర్తి చేస్తారని అలా కాకుండా సేవా కేంద్రాల ద్వారా ప్రైవేట్ ఏజెన్సీ వారికి ఇస్తే రిజిస్ట్రేషన్ చేయించుకునే వారికి చాలా ఇబ్బంది కలుగుతుందని, రాష్ట్రవ్యాప్తంగా లక్ష కుటుంబాలు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని వారు మృతికి ఇబ్బందు లేకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సరైన నిర్ణయాన్ని తీసుకోవాలని వారు కోరారు. ధర్నాకు ఒంగోలు వైసిపి నాయకులు మద్దతు తెలిపారు.

# షైనింగ్ స్టార్స్‌కు అభినందనలు

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జూలై 20)

మార్కాపురం పట్టణంలో సోమవారం జరిగిన షైనింగ్ స్టార్స్ కు అభినందన సభలో ఒక్కొక్కరికి రూ.20 వేలు నగదు బహుమతి, ప్రసంసా పత్రం, మెమొంటోలు జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పొదిలి పట్టణంలోని ఆల్ఫా హైస్కూల్‌లో షైనింగ్ స్టార్స్‌కు ఎంపికైన పదో తరగతి విద్యార్థినులు కె ఆల్ఫాగ్రేస్, షేక్ షబ్నాం అస్నీరాలు ఈ బహుమతిని అందుకున్నారు. అనంతరం ఆల్ఫా హైస్కూల్‌లో ప్రిన్సిపల్ వేల్పుల వెంకట్ విద్యార్థులను వారి తల్లిదండ్రులను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.







